ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

అనంతపురం

జిల్లా వార్తలు

ఉష్ణోగ్రతలు గరిష్ఠం కనిష్ఠం 36.0 25.0

బుధవారం 19 జూన్ 2024

ఉందామా..! వెళదామా..!

సమగ్రశిక్ష ప్రాజెక్టులోకి అడ్డదారుల్లో ప్రవేశం

వైసీపీ హయాంలో ఎంపీ, ఎమ్మెల్యేల సిఫార్సులు



సమగ్రశిక్ష ప్రాజెక్టు కార్యాలయం

అర్హత లేకున్నా ఎంట్రీ ఇచ్చిన గురుపుంగవులు

ఎన్నికల్లో 'వైసీపీ రుణం' తీర్చుకునేలా ప్రచారం

పభుత్వం మారడంతో తిరుగు టపాకు ప్రయత్నాలు

రీప్యాట్రేషన్‌కు ముగ్గురు టీచర్ల లేఖలు

కలెక్టర్‌కు చేరిన దొడ్డిదారి ఎంట్రీల జాబితా..?

అనంతపురం విద్య, జూన్ 18: 'ఉందామా..? వెళ్దామా..? ఉంటే ఇబ్బంది పడుతామేమో..! ప్రాజెక్టు నుంచి స్కూళ్లకు వెళితేనే మంచిదేమో..!' ఇదీ కొందరు సమగ్రశిక్ష ప్రాజెక్టు ఉద్యోగుల పరిస్థితి. అనంతపురం సమగ్రశిక్ష ప్రాజెక్టులో ఉండే సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారుల కొన్నాళ్లుగా డోలాయమాన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కొందరు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు తమకు ఉన్న పరిచయాలతో ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, నియోజకవర్గ నాయకులతో పైరవీలు చేసుకున్నారు. అప్పటి అధికారులపై ఒత్తిళ్లు తెచ్చారు. అర్హతలు లేకున్నా ప్రాజెక్టు కార్యాలయంలో పాగా వేశారు. కొందరు సెక్టోరియల్, మరికొందరు అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టుల్లో తిష్ట వేశారు. జిల్లా సరిహద్దు స్కూళ్లలో పనిచేయాల్సిన కొందరు, పొరుగు జిల్లా నుంచి కొందరు కలెక్టర్, జేసీ, డీఈఓపై ఎత్తిడి తెచ్చి ప్రాజెక్టులోకి ప్రవేశించారు. తమకు కావాల్సిన పోస్టులను దక్కించుకున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో కొందరు ఇక్కడి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. కొందరు ప్యాకప్ అంటుంటే.. మరికొందరు వెళ్దామా.. వద్దా.. అని సందిగ్ధంలో ఉన్నారు. ప్రాజెక్టు నుంచి వెళితే మంచి ప్లేస్ వస్తుందో రాదో అని కొట్టుమిట్టాడుతున్నారు. అప్పట్లో కొందరు అధికారులకు లక్షలకు లక్షలు సమర్పించారు. ఇప్పుడు ఏం చేయాలో దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు.

వైసీపీ నేతలతో పైరవీలు

జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు కార్యాలయంలో గతంలో పలు పోస్టులు ఖాళీగా ఉండేవి. ముఖ్యంగా ఏఎంఓ, అసిస్టెంట్ సీఎంఓ, అసిస్టెంట్ అలెస్కో, జీసీడీఓ, ఏఎస్ఓ పోస్టులు ఖాళీగా ఉండేవి. వైసీపీ ప్రభుత్వంలో జిల్లా సరిహద్దు స్కూళ్లలో ఉన్న టీచర్లు అప్పటి వైసీపీ ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకున్నారు. స్థానిక ఎమ్మెల్యేలను పట్టుకుని, సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారులపై, జాయింట్ కలెక్టర్‌పై ఒత్తిడి తెప్పించి, అధికారులను ఒప్పించారు. విడపనకల్లు మండలంలో పనిచేసే ఓ టీచర్ ఒక పోస్టును సంపాయించుకున్నారు. వైఎస్సార్‌టీపీ నాయకుడు, బెళుగుప్ప మండలంలో పనిచేసే ఓ టీచర్ స్థానిక ఎమ్మెల్యే, ఇతర నాయకులను పట్టుకుని ప్రాజెక్టులోకి ఎంట్రీ ఇచ్చాడు. రాయదుర్గం నియోజకవర్గంలోని సుదూర ప్రాంత స్కూల్‌లో పనిచేసే మరో టీచర్ వైసీపీకి చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే అండతో ప్రాజెక్టులోని కీలక పోస్టును కైవసం చేసుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లా నుంచి సైతం ఓ టీచర్ ప్రాజెక్టులోని కీలక ఉన్నతాధికారిని ప్రసన్నం చేసుకుని చేరిపోయారు. ఎలాంటి అనుభవం లేకున్నా మరో టీచర్ డి.హీరేహాళ్ మండలం నుంచి అప్పటి డీఈఓ ఆశీస్సులతో చోటు సంపాదించాడు. ఇలా చాలా మంది అడ్డదారుల్లో ప్రాజెక్టులో చేరిపోయారు.

రీప్యాట్రేషన్‌కు లెటర్లు...

ప్రాజెక్టులో పనిచేస్తున్న టీచర్లలో ఇప్పటికే ముగ్గురు రీప్యాట్రేషన్‌కు లెటర్లు పెట్టుకున్నట్లు సమాచారం. ఇద్దరు అసిస్టెంట్ ఏఎంఓలు, జీసీడీఓ ఇప్పటికే లెటర్లు ఇచ్చారు. వీరిలో కొందరు మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నారు. మరికొందరి సర్వీసు ఇంకా ఉంది. అయినా తమ పాత స్థానాలకు వెళతామని లెటర్లు ఇచ్చారు. వీరి సంగతి అలా ఉంచితే, వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, నాయకుల సిఫార్సులతో దొడ్డిదారిలో వచ్చిన సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులే ఇప్పుడు డైలమాలో ఉన్నారు. ఉందామా..? వెళ్దామా..? అని ఎటూ తేల్చుకోలేక సంకట స్థితిలో ఉన్నారు. ఇప్పటికే వీరి జాతకాలను ప్రాజెక్టు ఉన్నతాధికారులు కలెక్టర్ వద్ద ఉంచినట్లు విశ్వసనీయంగా తెలిసింది. కలెక్టర్ కోర్టుకు చేరిన బంతులు ఎక్కడ పడతాయో వేచి చూడాల్సిందే.

వైసీపీకి పావులు..

ప్రాజెక్టులోకి వచ్చిన కొందరు అధికారులు వైసీపీకి పావులుగా మారారు. సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులుగా సమగ్రశిక్ష ప్రాజెక్టులోకి ఎంట్రీ ఇచ్చిన అధికారులు ఎన్నికల వేళ వైసీపీ తరపున బాగానే ప్రచారం చేశారు. కొందరు డాబాలకు వెళ్లి విందు రాజకీయాల్లో పాల్గొన్నారు. మరికొందరు మళ్లీ వచ్చేది మన జగన్ ప్రభుత్వమే అంటూ తమదైన శైలిలో ప్రచారం చేశారు. ప్రాజెక్టులోకి వచ్చేందుకు ఎమ్మెల్యే, మంత్రి, ఎంపీ లెటర్ ఇచ్చారన్న సానుభూతితో, అధికారులకు ఫోన్లు చేశారన్న మమకారంతో సరెండర్ అయ్యారు. ఎన్నికల్లో వారి గెలుపు కోసం తమవంతు పోరాటం చేశారు. అందరి లెక్కలు తప్పాయి. తుఫాను వేగంలో టీడీపీ కూటమి ప్రభుత్వం దూసుకొచ్చింది. చంద్రబాబు ప్రభుత్వం కొలువుదీరింది. దీంతో అప్పుడు పైరవీలు చేసి అధికారులు రివర్స్ గేర్ వేస్తున్నారు. ఎందుకొచ్చిన గొడవ.. అప్పట్లో పనిచేసిన చోటుకు వెళ్లిపోదాం అనుకుంటున్నారు.

ఆరోగ్య మంత్రికి ఘన స్వాగతం

మంత్రి హోదాలో జిల్లాకు తొలిసారి సత్యకుమార్ యాదవ్

ఎన్డీఏ కూటమి పార్టీల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



మంత్రి సత్యకుమార్ యాదవ్, సందిరెడ్డి శ్రీనివాసులు, పరిటాల శ్రీరామ్‌తోపాటు ఇతరులకు గజమాల వేస్తున్న బీజేపీ ఎస్సీమోర్చా నాయకులు



బైక్ ర్యాలీ..

అనంతపురం సెంట్రల్, జూన్ 18: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారి జిల్లాకు వచ్చిన ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్‌కు ఘన స్వాగతం లభించింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు ఆధ్వర్యంలో అనంతపురం, రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్లు గొంది అశోక్ కుమార్, రావి చైతన్య కిషోర్ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను మంగళవారం ఘనంగా సత్కరించారు. బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాకే శివశంకర్, జిల్లా అధ్యక్షుడు ప్రభుకుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మందల శాంతకుమార్ గజమాలతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, బండారు శ్రావణిశ్రీ, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌తో కలిసి నగరంలో ర్యాలీ నిర్వహించారు. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు అడుగడుగునా పూల వర్షం కురిపిస్తూ, బాణసంచా పేల్చుతూ అభిమానాన్ని చాటుకున్నారు.

ఉద్యోగులు, సిబ్బందికి స్వేచ్ఛ..

ఐదేళ్ల వైసీపీ పాలనతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని వైద్య ఆరోగ్య శాఖలోని పలు విభాగాల అధికారులు, సిబ్బంది మంత్రి సత్యకుమార్ యాదవ్ ముందు వాపోయారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి నివాసంలో వారు మంత్రిని కలిశారు. తమకు న్యాయబద్ధంగా రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను కల్పించలేదని, టీఏ, డీఏ వంటివి కూడా ఇవ్వకుండా వేధించారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నియామకాలు, ఉద్యోగోన్నతులు, విధుల కేటాయింపు.. ఇలా అన్నింటిలోనూ వైసీపీ నాయకుల సిఫార్సులకే పెద్ద పీట వేశారని, అర్హులకు అన్యాయం చేశారని అన్నారు. పారిశుధ్య నిర్వహణ నిధులను కూడా మింగేసి కార్మికులను వేధించారని అన్నారు. దీంతో స్పందించిన మంత్రి, ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో ఉద్యోగులు, సిబ్బందికి ఎలాంటి సమస్యలు ఉండవని హామీ ఇచ్చారు. స్వేచ్ఛగా విధులు నిర్వహించే వాతావరణాన్ని కల్పిస్తామని అన్నారు. ఏపీఎంసీఏ నాయకులు నిరంజన్, సందీప్, హరికృష్ణ, గణేష్, సువర్ణ, దీప్తి తదితరులు మంత్రిని కలిసినవారిలో ఉన్నారు.

విత్తనశుద్ధి మందు వాసనకు రైతు మృతి



మల్లికార్జున (ఫైల్)

కణేకల్లు, జూన్ 18: విత్తన శుద్ధి మందు వాసన ప్రభావంతో ఓ రైతు మృత్యువాత పడ్డారు. కణేకల్లు మండలంలోని గరుడచేడు గ్రామ రైతు బెస్త మల్లికార్జున(38) రెండెకరాల పొలంలో వేరుశనగ సాగు చేసేందుకు మంగళవారం విత్తనశుద్ధి చేశాడు. ఆ సమయంలో ఎండ ఎక్కువగా ఉండటం, విత్తనశుద్ధికి వాడిన మందు వాసన ప్రభావంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. పొలంలో పనులు చేస్తున్న సమయంలో ఇబ్బంది పడ్డ మల్లికార్జున, ఇంటికి వెళ్లి నిద్రపోయాడు. ఎంతటికీ నిద్ర లేవకపోవడంతో కుటుంబ సభ్యులు తట్టి లేపారు. కానీ కదలికలు లేకపోవడంతో గమనించారు. అప్పటికే మల్లికార్జున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలుసుకున్నారు. రైతు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

జ్వరాలు ప్రబలకుండా చూడండి

కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



సీజనల్ వ్యాధుల నివారణకు సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్

అనంతపురం టౌన్, జూన్ 18: జిల్లాలో మలేరియా, డెంగీ ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని వివిధ శాఖల అధికారులను కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం కలెక్టరేట్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. వర్షాకాలం దోమలు ప్రబలే ప్రమాదం ఉందని, మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని ఆదేశించారు. ఫాగింగ్ చేపట్టాలని, పరిసరాలు పరిశుభ్రతంగా ఉండేలా చూడాలని సూచించారు. అన్ని వసతి గృహాలలో మలేరియా సిబ్బంది సహకారంతో ఐఆర్ఎస్ పిచికారీ చేయించాలని ఆదేశించారు. పంచాయతీలలో చెత్త తొలగించాలని, మురుగునీరు సక్రమంగా పారేలా చూడాలని ఆదేశించారు. తాగునీటి ట్యాంకులను క్లోరినేట్ చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. లార్వాను తినే చేప పిల్లల ఉత్పత్తి, ఎక్కడ వదులుతున్నారో వివరాలను పంపాలని ఆదేశించారు. మలేరియా, డెంగీ బాధితులకు చికిత్స అందించేందుకు ఆస్పత్రులలో వసతులు ఏర్పాటు చేసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు.

బడికి పంపండి..

చదువుకుంటేనే పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కలెక్టర్ అన్నారు. కలెక్టరేట్‌లో 'బడికి పంపుదాం' కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. చదువుకు పేదరికం అడ్డుకాదని, ప్రభుత్వం అన్ని రకాల వసతులు కల్పించి ఉచితంగా చదువు చెప్పిస్తుందని అన్నారు. చదువు లేకపోతే ఎంత సంపద ఉన్నా వ్యర్థమని అన్నారు. ప్రతి చిన్నారినీ బడికి పంపాలని తల్లిదండ్రులను కోరారు. బాల్య వివాహాలను అడ్డుకోవాలని, బాలకార్మిక వ్యవస్థను రూపు మాపాలని అన్నారు. సమావేశాలలో జేసీ కేతన్ గార్గ్, జడ్పీ సీఈఓ నిదియ, నగరపాలిక కమిషనర్ మేఘ స్వరూప్, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఆర్వో రామకృష్ణారెడ్డి, డీఎంహెచ్ఓ ఈబీ దేవి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఇన్‌చార్జి డీఈఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇప్పుడెలా..!





ఐదేళ్లు వైసీపీతో సావాసం

పంచాయతీల్లో అడ్డగోలుగా వ్యవహారాలు

భారీగా నిధుల దుర్వినియోగం

పంచాయతీ స్థలాలు వైసీపీ నాయకుల పరం

ఉన్నతాధికారులకు చుక్కలు చూపిన సిబ్బంది

అధికారం మారడంతో వణుకుతున్న అక్రమార్కులు

అనంతపురం న్యూటౌన్, జూన్ 18: వైసీపీతో అంటకాగిన పంచాయతీ కార్యదర్శులు, ఈవోఆర్డీలకు కొత్త ప్రభుత్వం గుబులు పట్టుకుంది. అడ్డగోలు పనులు చేసినవారు చర్యల నుంచి తప్పించుకునేందుకు దారులు వెతుక్కుంటున్నారు. పంచాయతీల పరిధిలోని విలువైన స్థలాలను వైసీపీ నాయకులకు అప్పనంగా కట్టబెట్టారు. ఈ క్రమంలో అధికారులను సైతం బురిడీ కొట్టించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే మునుముందు ఇబ్బందులు ఎదురౌతాయని ఉన్నతాధికారులు హెచ్చరించినా కొందరు ఖాతరు చేయలేదు. వైసీపీ నాయకులు ఏది చెబితే అది చేయాల్సిందే అన్నట్లు వ్యవహరించారు. ఏదైనా ఫైల్‌ను ఉన్నతాధికారులు పెండింగ్ పెడితే.. వెంటనే వైసీపీ నాయకులను రంగంలోకి దించేవారు. ఆ పార్టీ నాయకుల వద్ద మకాం వేసి, ఒత్తిడి తెప్పించి మరీ పనులను చక్కబెట్టుకున్నారు. ఒకానొక సందర్భంలో 'మీరు చేయలేకుంటే చెప్పండి.. మిమ్మల్ని బదిలీ చేయించి.. పనులు చేసేవారిని తెప్పించుకుంటాం..' అని ఉన్నతాధికారులనే బెదిరించిన ఘటనలు ఉన్నాయి. ఈ స్థాయిలో పేట్రేగిపోయిన పంచాయతీ సిబ్బంది జాబితాను ఉన్నతాధికారులు సంకలో పెట్టుకుని తిరుగుతున్నారు. ఏ చిన్న అవకాశం దొరికినా తోక కత్తిరించేందుకు సిద్ధంగా ఉన్నారని ప్రచారం జరుగుతోంది. విషయం తెలుసుకున్న అక్రమార్కులు.. టీడీపీ కూటమి నాయకుల శరణు కోరేందుకు సిద్ధమవుతున్నారు. చర్యలు వద్దు.. బదిలీ వచ్చేవరకూ కాపాడండి అని వివిధ మార్గాల్లో ప్రయత్నాలు సాగిస్తున్నారని తెలిసింది.

రూరల్ రూటే వేరు..

జిల్లా మొత్తం ఒక ఎత్తు అయితే.. అనంతపురం రూరల్ మండలం మరో ఎత్తు. ఇక్కడ ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ వారికి అనుకూలంగా వ్యవహరించే ఓ బృందం ఉంది. వైసీపీ పాలనలో ఐదేళ్లపాటు వారి వ్యవహారాలు మూడు పువ్వులు, ఆరు కాయలు అన్నట్లుగా సాగాయి. అక్రమ వ్యవహారాలలో పరస్పరం సహకరించేకునే వీరు.. ఏ పార్టీ అధికారంలో ఉన్నా వెనక్కు తగ్గరని సమాచారం. నాయకుడు ఎవరైనా.. పని ఏదైనా తమ వద్దకు రావాల్సిందే అన్నట్లు వ్యవహరిస్తారు. 'ఎవరికి ఇవ్వాల్సింది వారికి ఇస్తాం.. ఇక మాకు అడ్డేముంటుంది..? పంచేదంతా ప్రజల సొమ్మే కదా..?' అని బహిరంగంగా వ్యాఖ్యానిస్తుంటారు. వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకులతో అంటకాగినవారు తాజాగా కూటమి నాయకులను బుట్టలో వేసుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. సన్నిహిత నాయకులను వెంటబెట్టుకుని ముఖ్యనాయకులను ప్రసన్నం చేసుకోనే పనిలో నిమగ్నమయ్యారు. రూరల్ మండలంలోని కొందరు సెక్రటరీలు, ఈవోఆర్డీలు చేసే రాజకీయం మామూలుగా ఉండదని అంటున్నారు. వీరిపట్ల కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని ప్రజలు సూచిస్తున్నారు.

అప్పనంగా కాజేశారు..

అనంతపురం రూరల్ మండలంలో ఓ పంచాయతీ సెక్రటరీ విలువైన స్థలాన్ని వైసీపీ నాయకుడికి కట్టబెట్టారు. పాలకవర్గం లేని ఆ పంచాయతీలో స్థానిక నాయకుడికి సెక్రటరీ అనుకూలంగా వ్యహరించారు. ఓ నాయకుడు అడిగిందే తడవుగా.. ఆయన అనుచరుడికి పంచాయతీ స్థలాన్ని కట్టబెట్టినట్లు తెలిసింది. ప్రభుత్వం మారడంతో సెక్రటరీకి వణుకు మొదలైందని అంటున్నారు.

చక్రం తిప్పారు..

వైసీపీ హయాంలో జిల్లాలో కొందరు పంచాయతీ సెక్రటరీలు, ఈవోఆర్డీలు చక్రం తిప్పారు. అనంతపురం రూరల్, రుద్రంపేట, నారాయణపురం, కక్కలపల్లి, చియ్యేడు, ఆకుతోటపల్లి, బుక్కరాయసముద్రం, రాప్తాడు, పామిడి, పుట్లూరు, యల్లనూరు మండలాల్లోని పలు పంచాయతీలు, ఉరవకొండ, కణేకల్లు పంచాయతీలలో పనిచేసిన కొందరు కార్యదర్శులు విచ్చలవిడిగా వ్యవహరించారు. ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారన్న ఆరోపణలు ఎదుర్కొన్నారు. బుక్కరాయసముద్రం పంచాయతీలో జిల్లాలో అత్యధికంగా అక్రమాలు చోటు చేసుకున్నాయన్న ప్రచారం ఉంది. అక్కడి నాయకుల అండతో సర్పంచ్‌ను సైతం సైడ్ చేసి అక్రమాలకు పాల్పడ్డారు. వ్యవహారాలు బయటపడ్డాక.. తప్పంతా సర్పంచ్‌పైనే మోపారు. వాస్తవాలపై ఓ డివిజనల్ అధికారి ఇచ్చిన నివేదికను పక్కన పెట్టించి.. మరో అధికారి చేత అనుకూల నివేదిక తెప్పించుకునేదాకా వ్యవహారం సాగింది. కూటమి ప్రభుత్వం విచారణ జరిపితే పంచాయతీల్లో జరిగిన అక్రమాలు భారీగా వెలుగులోకి వస్తాయని జనం అంటున్నారు.

పాత కక్షలతోనే హత్య

● డీఎస్పీ జనార్దన్ నాయుడు




మాట్లాడుతున్న డీఎస్పీ జనార్దన్ నాయుడు

తాడిపత్రిటౌన్, జూన్ 18: పట్టణానికి చెందిన యల్లనూరు లాల్‌బాషా హత్యకు పాతకక్షలే కారణమని తాడిపత్రి డీఎస్పీ జనార్దన్ నాయుడు తెలిపారు. ఈ కేసులో నిందితుడు షేక్ హాజీ మలంగ్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. పట్టణ పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. లాల్‌బాషాకు హాజీ మలంగ్‌కు మధ్య నందలపాడులో ఆధిపత్య పోరు నడుస్తోందని డీఎస్పీ తెలిపారు. లాల్‌బాషా సమీప బంధువు యల్లనూరు మహమ్మద్‌పై హాజీ మలంగ్, అతని స్నేహితులు 2021లో హత్యాయత్నం చేశారని, ఈ మేరకు కేసు నమోదైందని డీఎస్పీ తెలిపారు. ఆ సమయంలో హాజీ మలంగ్‌పై రౌడీ షీట్ తెరిచామని తెలిపారు. మద్యం మత్తులో ఉన్న లాల్‌బాషా ఈ నెల 16న హాజీ మలంగ్‌ను చంపుతానని బెదిరించాడని దీంతో లాల్‌బాషాను చంపాలని మలంగ్ నిర్ణయించుకున్నాడని తెలిపారు. లాల్‌బాషా కదలికలపై నిఘా వేసి, ఈ నెల 17న అర్ధరాత్రి తన ఇంటిపై నిద్రిస్తుండగా పారతో దాడి చేసి చంపేశాడని డీఎస్పీ తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించామని వెల్లడించారు. సమావేశంలో పట్టణ సీఐ నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

చరిత్రపై చెరగని సంతకం


పదో తరగతి పాఠ్యపుస్తకంపై బుగ్గరామలింగేశ్వరుడి ఆలయ ముఖచిత్రం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయానికి మరో ఘనత దక్కింది. పదో తరగతికి కొత్తగా వచ్చిన సోషియల్ సబ్జెక్టులో భాగంగా హిస్టరీ పాఠ్య పుస్తకం ముఖ చిత్రంపై తాడిపత్రిలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయ గాలిగోపురం ముఖచిత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం ముద్రించింది. నేటితరం విద్యార్థులకు అలనాటి ఆలయాల చరిత్ర, శిల్పకళ సంపద గురించి తెలియజేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఈ పని చేసినట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఈ ఆలయంలో స్వామివారి లింగం చుట్టూ ఎల్లప్పుడూ జలధార వస్తుంటుంది. ఇక్కడి స్తంభాలను తాకితే సప్త స్వరాలు పలుకుతాయనేది నానుడి.



పాఠ్యపుస్తకంపై ముద్రించిన గాలిగోపురం ముఖచిత్రం

సంక్షేమం తిరిగొచ్చేనా?



వైసీపీ పాలనలో సంక్షోభంలో సంక్షేమ వసతిగృహాలు

శిథిలావస్థలో కొన్ని... సమస్యల నడుమ మరిన్ని..

అసౌకర్యాలు, అభద్రత మధ్య అల్లాడుతున్న విద్యార్థులు

కూటమి ప్రభుత్వం రాకతో చిగురిస్తున్న ఆశలు

అనంతపురం ప్రెస్‌క్లబ్

రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో సంక్షేమ వసతిగృహాలకు మంచిరోజులు వచ్చినట్లేనని పలువురు పేర్కొంటున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో సంక్షేమ వసతిగృహాలను పూర్తిగా నిర్వీర్యం చేసింది. మెయిన్‌టెనెన్స్ ఫండ్ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఒక్క భవనాన్ని నిర్మించకపోగా... ఉన్న వాటిని శిథిలావస్థకు చేర్చేసింది. వసతి గృహాల్లో కనీస మౌలిక వసతులు కల్పనను పెడ చెవిన పెట్టింది. దీంతో వసతి గృహాల్లో ఉండే పేద విద్యార్థులు బిక్కుబిక్కు మంటూ ఐదేళ్ల గడిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వసతిగృహాల్లోని విద్యార్థులతో పాటు... ఆయా సంక్షేమశాఖల అధికారుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు సంక్షేమ వసతిగృహాల అభివృద్ధికి పెద్ద పీట వేసింది. ప్రతి సంక్షేమ వసతిగృహానికి మెయింటెనెన్స్ ఫండ్స్ విడుదల చేసింది. వసతిగృహాల్లో మౌలిక వసతులు కల్పించింది. విద్యార్థులకు వైద్యపరీక్షలు చేయించి, నాణ్యమైన భోజనం అందించింది. ఎప్పటికప్పుడు భవనాలకు మరమ్మతులు చేయించింది. ఇప్పుడు కూడా అవన్నీ యథాతథంగా అమలు చేస్తుందని కూటమి ప్రభుత్వంపై విద్యార్థులు, అధికారులు, వార్డెన్లు ఆశలు పెట్టుకున్నారు.



భయం గుప్పిట్లో విద్యార్థులు

జిల్లాలో సగానికిపైగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వసతిగృహాలు సమస్యలతో కొట్టు మిట్టాడుతున్నాయి. పలు వసతిగృహాలు పాతబడటంతో గదుల్లోని స్లాబ్‌లు పెచ్చులూడిపోతున్నాయి. దీనికి తోడు గోడలు నెమ్ము ఎక్కుతుండటంతో ఎప్పుడు కూలుతాయోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు చిన్నపాటి వర్షాలు కురిస్తేనే పలు వసతిగృహాల్లో స్లాబ్‌ల నుంచి నీరు కారుతోంది. దీంతో ఉన్న గదుల్లోకే విద్యార్థులు ఇరుకిరుకుగా వసతి పొందుతున్నారు. చాలా వసతిగృహాల మరుగుదొడ్లకు నీటి సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నా రు. బయటి నుంచి బకెట్లలో నీరు తెచ్చుకొని హాస్టల్ ఆవరణలో స్నానాలు చేస్తున్నారు. బహిర్భూమికి హాస్టల్ వెలుపలి ప్రాంతాలకు వెళ్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో బయటికెళితే ఏ పురుగు పుట్ర జారిన పడాల్సి వస్తుందోనని ఆయా వసతిగృహాల్లోని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం విద్యాసంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో వసతిగృహాల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

సమస్యల నడుమ వసతిగృహాలు..

● రాప్తాడు మండలం హంపాపురం బీసీ బాలుర వసతిగృహంలో సమస్యలు విలయ తాండవం చేస్తున్నాయి. వసతిగృహానికి ప్రహరీ లేదు. ఆవరణలోనే పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు పెరిగిపోయాయి. దీనికితోడు చుట్టుపక్కల ఉన్నవారు అక్కడ చెత్తాచెదారాన్ని వేస్తుండటంతో అందులో నుంచి విషపురుగులు సంచరిస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు.

● శింగనమల ఎస్సీ బాలుర వసతిగృహంలో విద్యార్థులకు మరుగుదొడ్లు కరువయ్యాయి. నీటి సౌకర్యం లేకపోవడంతో ఆ మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. దీంతో కొందరు ఆరుబయటే స్నానాలు చేస్తున్నారు. బహిర్భూమి కోసం విద్యార్థులు బయటిప్రాంతాలకు వెళ్తున్నారు.

● గుత్తి మండలం ఇసురాళ్లపల్లి బీసీ వసతి గృహంలో గదుల పెకప్పు పెచ్చులు ఊడిపడుతున్నాయి. భవనం శిథిలావస్థకు చేరుకుంది. ప్రహరీ చుట్టూ సగానికి పడిపోయింది. దీంతో వార్డెనే బండలు నాటించారు. వసతిగృహంలో దాదాపు మూడు గదుల్లో చిన్నపాటి వర్షానికే స్లాబులు నెమ్ము ఎక్కి నీరంతా గదుల్లోకి వస్తోందని విద్యార్థులు చెబుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో విద్యార్థులు హాస్టల్‌లో ఉన్న రెండు మూడు గదుల్లోనే ఇరుకిరుకుగా వసతి పొందుతున్నారు.

● గుత్తిలో కొండకింద ఉన్న బీసీ బాలుర వసతిగృహం భవనం ఎప్పుడు కూలుతుందోనని విద్యార్థులు భయపడుతున్నారు. ప్రహరీ లేకపోవడంతో పందులు హాస్టల్ ఆవరణలోకి వస్తున్నాయి. ఒకటి, రెండు గదులు మినహా... మొత్తం గదులన్నీ శిథిలమయ్యాయి. చిన్నపాటి వర్షానికే నీరంతా గదుల్లోకి వస్తోందని, అందుకే వర్షం వస్తే అందరూ కలిసి ఉన్న గదుల్లోనే వసతి పొందుతున్నట్లు సమాచారం.

● బెళుగుప్పలోని బీసీ బాలుర వసతి గృహంలో నీటి సౌకర్యం లేక మరుగుదొడ్లు నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకున్నాయి. విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకోవడం కోసం బయటి పరిసర ప్రాంతాలకు వెళ్తున్నట్లు సమాచారం.

● జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలికల నెం-2 వసతిగృహ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఆ వసతిగృహంలో మూడు గదులు దెబ్బతిన్నాయి. స్లాబ్ పెచ్చులూడిపోయాయి. దీంతో ఉన్న గదుల్లోనే విద్యార్థులు వసతి పొందుతున్నారు. మరమ్మతులకు సంబంధించి నివేదికలు పంపినప్పటికీ చర్యలు శూన్యం.

● నగరంలోని గిల్డాఫ్ సర్వీస్ స్కూల్ పక్కనున్న బీసీ నెం-1, నెం-2, ఎస్సీ బాలికల స్కూల్, కాలేజీ హాస్టళ్ల సముదాయ వసతిగృ ప్రహరీ కూలిపోయింది. తిరిగి నిర్మించకపోవడంతో రాత్రి సమయాల్లో భద్రత సమస్య ఏర్పడుతోంది. పడిపోయిన గోడ స్థానంలో వార్డెన్లు రేకులు అడ్డుగా పెట్టించారు. అయినా విద్యార్థినులు భయాందోళనల మధ్యనే వసతి పొందుతున్నారు.



హంపాపురం బీసీ బాలుర వసతిగృహంలో పెరిగిపోయిన పిచ్చిమొక్కలు




అనంతపురంలోని గిల్డాఫ్ సర్వీస్ స్కూల్ పక్కనున్న బీసీ నం-1, నం-2, ఎస్సీ బాలికల స్కూల్, కాలేజీ హాస్టళ్ల సముదాయం ప్రహరీ కూలిన దృశ్యం



శింగనమల ఎస్సీ బాలుర వసతిగృహంలో శిథిలావస్థలో మరుగుదొడ్లు

అధ్వానంగా ఆసుపత్రి



- ఆగిన పునరుద్ధరణ పనులు
- కొన్ని మందులు బయట తెచ్చుకోవాల్సిందే
- అందుబాటులోలేని బాత్‌రూములు
- వాష్ రూముల్లేక సిబ్బందికీ ఇబ్బందే
- యూరిన్ కంటెయినర్లకూ కటకటే
- పట్టిపీడిస్తున్న పారిశుధ్య సమస్య

గుంతకల్లు, జూన్ 18: పట్టణంలోని రాయ్‌సాహెబ్ మిడతల హంపయ్య ఏరియా ఆసుపత్రిలో సమస్యలు తిష్ట వేశాయి. దీంతో రోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రి పెద్దదేకానీ.. అవసరానికి కొన్ని మందులు, పరికరాలు ఉండక పోవడంతో రోగులు బయటనుంచి తెచ్చుకోవాల్సి వస్తోంది. ఆసుపత్రి పాత భవనంలో పాక్షిక పునరుద్ధరణ పనులు జరుగు తుండడంతో బాత్‌రూములను మూసేశారు. దీంతో రోగులతో పాటు ఇక్కడ పనిచేసే సిబ్బంది, వైద్యులు వాష్ రోములు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రిలో అవసరానికి కొన్ని మందులు దొరకడం లేదని, పరికరాలను కూడా బయట కొని తెచ్చుకోవలసి వస్తోందని రోగులు ఆరోపిస్తున్నారు. ఆసుపత్రి వద్ద పారిశుధ్య నిర్వాహణ లేకపోవడంతో దుర్వాసన రాజ్యమేలుతోంది.



మూతపడిన వాష్ రూములు



గుంతకల్లు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి



ఆసుపత్రి గదుల బయట పోగుపడ్డ చెత్త

ఎక్కడి పనులు అక్కడే..

ఆసుపత్రి పాత భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో మరమ్మతు పనులను గత సంవత్సరం చేపట్టారు. అయితే చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులను నిలిపివేశాడు. దీంతో పాత భవనంలో రోగుల కోసం ఏర్పాటుచేసిన బాత్‌రూములు, టాయి లెట్లు మూతపడ్డాయి. ఈ కారణంగా వాష్ రూములు లేకపోవడంతో రోగులు, వైద్యులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. కొందరు దూరంగా వెళ్లలేక బయటనే ఉన్న కాల్వల్లో మూత్ర విసర్జన చేస్తున్నారు. ఆసుపత్రి కాల్వల్లో మురుగు నిలిచిపోయింది, ఆసుపత్రి పక్కనే చెత్తను కుప్పగా పోశారు. పై అంతస్తుకు వెళ్లే మెట్ల పక్కన పాత బెడ్లను డంప్ చేశారు. దీంతో ఆసుపత్రిలో పారిశుధ్య సమస్యతో పాటు దుర్వాసన వ్యాపించి రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

మందులు, పరికరాలకు కొరత

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యులు రాసిచ్చే కొన్ని మందులు ఉండడం లేదు. వైద్య పరీక్షలకు సంబంధించి బాత్‌రూములలో యూరిన్ కంటెయినర్లను అందు బాటులో ఉంచడంలేదు. రక్తం అవసరమైన రోగుల బ్లడ్ శాంపిల్స్‌ను తీసి పంపాల్సిన ట్యూబులు లేవు. వాటిని రోగులు బయట నుంచి కొని తెచ్చుకోవాల్సిందే. ఆసుపత్రిలో పలు మందుల కొరత నెలకొంది. అడ్మిషన్‌లో ఉన్న రోగులకు బెడ్‌షీట్లను సరిగా మార్చడంలేదనే ఆరోపణలున్నాయి. రోగుల అవసరార్థం ఆసుపత్రికి స్వచ్ఛంద సంస్థలు బెడ్‌షీట్లను విరాళంగా ఇచ్చినా పరిస్థితిలో మార్పు ఉండటంలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

ఏ ఓపీ ఎక్కడ ఉందో...?

పాతభవనం పునరుద్ధరణ పనులు పూర్తికానందున కొన్ని ఓపీ గదులను మెటర్నరీ అవసరాల కోసం నిర్మించిన కొత్త భవనంలోకి మార్చారు. కానీ ఏ ఓపీ ఎక్కడ ఉందన్న గుర్తులు ఆసుపత్రిలో ఏర్పాటుచేయలేదు. దీంతో ఓపీ స్లిప్ తీసుకున్న రోగులు సంబంధిత వైద్యుల వద్దకు వెళ్లడానికి ఇబ్బందులుపడుతున్నారు. వెంటనే ఓపీ స్లిప్పులు రాసే చోటు నుంచి ఓపీ రూములకు వెళ్లే మార్గాన్ని చూపుతూ గుర్తులు, రూముల నెంబర్లు, వైద్య విభాగాల పేర్లను గోడలకు రాయాలని ఆసుపత్రికి వచ్చేవారు కోరుతున్నారు.



నిలిచిపోయిన రెనవేషన్ పనులు



మెట్ల పక్కన డంప్ చేసిన పాత బెడ్లు

రోగులను కసురుకుంటున్నారు



రెండు రోజుల క్రితం కడుపునొప్పితో ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యాను. ఆసుపత్రిలో నర్సులు అసలు పట్టించుకోవడం లేదు.. ఏమడిగినా నర్సులు, ఎంఎన్‌ఓ, ఎఫ్ఎన్‌ఓలు కసురుకుంటున్నారు. కడుపు నొప్పి ఉంది సూది వేయాలని అడిగితే... ఇక్కడ సూదులు లేవు, బయట నుంచి తెచ్చుకోవాలని చెప్పారు. లేదంటే ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లాలని నర్సులు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లలేక ఇక్కడికి వస్తే సిబ్బంది పట్టించుకోవడం లేదు.

\- కె. రామకృష్ణ, గుంతకల్లు

మధ్యాహ్నం పూట అసలు పట్టించుకోరు



రెండు రోజుల క్రితం నా భార్యకు జ్వరం వస్తే ఆసుపత్రిలో అడ్మిట్ చేశాను. మధ్యాహ్నం పూట నర్సులు అసలు పట్టించుకోరు. మందులు, సూదులు కావాలని అడిగితే కింద క్యాజు వాలిటీలో చూపించుకోవాలని ఉచిత సలహా ఇస్తున్నారు. రోగులకు ఉదయం ఒక సెలైన్ బాటిల్ పెడతారు. రాత్రి ఒక సూది మాత్రమే వేస్తున్నారు. సెలైన్ బాటిల్ అయిపోయిం దని నర్సును పిలిస్తే దాని వైర్‌ను లాక్ చెయ్యండి. ఆ మాత్రం తెలియదా.. వేరే సెలైన్ వచ్చేంత వరకూ ఉండలేరా? అంటూ కటువుగా మాట్లాడుతున్నారు. : మస్తాన్, పందికుంట

ఉద్యమంలా మొక్కల పెంపకం

- ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ, జూన్18: జిల్లాలో మొక్కల పెంపకాన్ని ఉద్యమంలా చేపట్టాలని ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ పిలుపునిచ్చారు. మండలంలోని కౌకుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జపనీస్ టెక్నిక్ అయిన 'మియా వాకీ సైంటిఫిక్' పద్ధతిలో వివిధ నమూనాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. మొక్కలు నాటడడమే కాకుండా వాటిని సంరక్షించాల్సిన బాధ్యత కూడా మనందరిపై ఉందన్నారు. జిల్లాలో నీటి సంరక్షణ, మెగా ప్లాంటేషన్ కార్యక్రమాలు, కళ్యాణదుర్గం, రాయదుర్గం నగర వనాల అభివృద్ధి గురించి మంత్రికి డీఎఫ్‌వో వినీత్ కుమార్ వివరించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియా దేవి, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, టీడీపీ నాయకులు మల్లికార్జున, పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న మంత్రి కేశవ్

పీజీ ప్రవేశ పరీక్షల్లో సత్తా

ఏడుగురికి రాష్ట్రస్థాయి పదిలోపు ర్యాంకులు

అనంతపురం సెంట్రల్, జూన్ 18: పీజీ కోర్సులలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షల్లో ఉమ్మడి జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు. ఏకంగా ఏడుగురికి రాష్ట్రస్థాయిలో పదిలోపు ర్యాంకులు వచ్చాయి. వివిధ కోర్సులలో వీరు ఉత్తమ ర్యాంకులు సాధించారు. బత్తలపల్లి మండలం గంటాపురం గ్రామానికి చెందిన రాజవర్ధన్ నాయుడు కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో రాష్ట్రస్థాయి 9వ ర్యాంకును సాధించాడు. సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో అనంతపురం ఇందిరా నగర్‌కు చెందిన హరిత రెండో ర్యాంకును, గుంతకల్లు మండలం కసాపురం గ్రామానికి చెందిన ముకుందసాయి ఏడో ర్యాంకును, నల్లమాడకు చెందిన సుదర్శన్ 13వ ర్యాంకును సాధించారు. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో కదిరికి చెందిన షఫ్రాన్ రాష్ట్రస్థాయి 8వ ర్యాంకును సాధించం విశేషం. ఈసీఈలో గుంతకల్లుకు చెందిన హర్షితకు 5వ ర్యాంకు, ఫుడ్ టెక్నాలజీలో అనంతపురం నగరానికి చెందిన విజేతకు 8వ ర్యాంకు వచ్చాయి. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో పెనుకొండ మండలం సత్తారుపల్లికి చెందిన అక్షయ 7వ ర్యాంకును సాధించారు. ఫార్మసీ విభాగంలో కొత్తకోటకు చెందిన గణేష్ రాష్ట్రస్థాయి ఏడో ర్యాంకును సాధించాడు.



హరిత(సివిల్ 2వ ర్యాంకు)



విజేత(8వ ర్యాంకు

హరితకు రెండో ర్యాంకు

జేఎన్‌టీయూలో ఇటీవల బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ పూర్తిచేసిన హరిత ఆ విభాగంలో పీజీ ప్రవేశ పరీక్షల్లో రాష్ట్రస్థాయి రెండో ర్యాంకును సాధించడం విశేషం. హరిత తల్లి గృహిణి కాగా తండ్రి నీటిపారుదల శాఖ ఉద్యోగి. వారి ప్రోత్సాహంతో మంచి ర్యాంకు సాధించానని విద్యార్థి ఆనందాన్ని వ్యక్తంచేసింది. తెలంగాణ పీజీ సెట్‌లో ఫుడ్ టెక్నాలజీ కోర్సు ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షలో ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థి విజేత, ఏపీ పీజీసెట్‌లో 8వ ర్యాంకును సాధించడం విశేషం. ఎంటెక్ పూర్తిచేసి ఉత్తమ ఇంజనీర్‌గా సేవలందించాలన్న లక్ష్యంతో పీజీసెట్‌లో మంచి ర్యాంకును పొందానని విజేత పేర్కొన్నారు.

కేంద్ర బృందం పర్యటన షెడ్యూల్ ఖరారు

- నేడు రొద్దం, రేపు విడపనకల్లు, వజ్రకరూరులో..

అనంతపురం అర్బన్, జూన్ 18 : కేంద్ర ప్రభుత్వ ఇంటర్ మినిస్టీరియల్ బృందం జిల్లా పర్యటన షెడ్యూల్ ఖరారైంది. బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట దాకా కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ నేతృత్వంలో వ్యవసాయ, అనుబంధ శాఖాధికారులతో ఒకటో, రెండో కరువు బృందం సభ్యులు సమావేశం కానున్నారు. ముందుగా గతేడాది రబీ సీజన్ పంటనష్టంపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తారు. అనంతరం అక్కడే పంటనష్టంపై జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ బృందం సభ్యులకు వివరించనున్నారు. ఆ తర్వాత మధ్యాహ్నం 2 గంటల దాకా ఆర్అండ్‌బీ అతిథి గృహంలో భోజన విరామం తీసుకుంటారు. అక్కడి నుంచి ఒకటో బృందం టీం లీడర్ కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్య శాఖ జాయింట్ సెక్రటరీ రితీష్ చౌహాన్, సభ్యులు పొన్నుస్వామి, సునీల్‌దుబేలు సభ్యులు సత్యసాయి జిల్లా రొద్దం మండలానికి వెళ్తారు. రెండో బృందం సభ్యులు కర్నూలు జిల్లాకు వెళతారు. రొద్దంలో ఒకటో బృందం సభ్యులు పర్యటన ముగించుకొని రాత్రికి అనంతపురం నగరంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో బస చేస్తారు. 20వతేదీ ఉదయం 9.30 గంటలకు ఇక్కడి నుంచి బయలుదేరి విడపనకల్లు మండలం మలాపురం గ్రామానికి వెళ్లి కరువు ప్రభావిత పొలాలను పరిశీలించడంతోపాటు స్థానిక రైతులతో ముఖాముఖిగా మాట్లాడి రబీ పంటనష్టంపై ఆరా తీస్తారు. ఆ తర్వాత 11.10 గంటలకు వజ్రకరూరు మండలం గూళ్యపాల్యం గ్రామానికి చేరుకొని స్థానిక రైతులతో ముఖాముఖిగా మాట్లాడతారు. ఇంతటితో కరువు బృందం పర్యటన ముగుస్తుంది.

రైతులు నష్టపోకుండా పరిశోధనలు పెంచాలి

- శాస్త్రవేత్తలకు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సూచన
- ఉమ్మడి జిల్లాలో 5.28 లక్షల మంది రైతులకు రూ.106 కోట్ల పీఎం కిసాన్ సొమ్ము విడుదల

బుక్కరాయసముద్రం, జూన్18: ఉమ్మడి జిల్లాలో రైతులు ఏటా సాగులో నష్టపోతున్నారని, రైతులు నష్టపోకుండా శాస్త్రవేత్తల పరిశోధనలు మరింత పెంచాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని రెడ్డిపల్లి కేవీకే కేంద్రంలో పీఎం కిసాన్ నిధులను విడుదల కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎంపీతో పాటు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో పీఎం కిసాన్ కింద 2లక్షల 76వేల మంది రైతులకు రూ.55.58 కోట్ల లబ్ధి చేకూరినట్లు తెలిపారు. సత్యసాయి జిల్లాలో 2.52 లక్షల మంది రైతులు లబ్ధి పొందారన్నారు. నీటి వసతి గల ప్రాంతాల్లో పచ్చి మేత కొరకు పశుగ్రాస పంటలుగా సజ్జ , బొబ్బర్ల పంటలు వేసుకోవాలన్నారు. రూ. 50.44 కోట్ల నిధుల విడుదల అయినట్లు తెలిపారు. ప్రధాన మంత్రి అందించిన నిధులను రైతుల సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు సీఎం చంద్రబాబునాయుడు రూ.20వేలు పెట్టుబడి సాయం కింద ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులకు ఉపయోగపడే కోల్డ్ స్టోరేజీ, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ రైతుల సాగు చేసిన పంటలకు నిరంతరం శాస్త్రవేత్తలు అందుబాటులో ఉండి తగు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. కేవలం వ్యవసాయం కాకుండా, కోళ్లు, గొర్రెల పెంపకంపై రైతులు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో కేవీకే ప్రధాన శాస్త్రవేత్త మల్లీశ్వరీ , జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ , ఎంపీపీ సునీత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ అంబికాలక్ష్మీనారాయణ , పక్కన కలెక్టర్ వినోద్‌కుమార్

ఇంటర్ సప్లీ పరీక్షల్లో 60.69 శాతం ఉత్తీర్ణత

అనంతపురం విద్య, జూన్ 18 : ఇంటర్మీడియట్ సెకెండ్ ఇయర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో జిల్లాలో 60.69 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆర్ఐఓ వెంకటరమణ నాయక్ మంగళవారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 4,811 మంది పరీక్షలకు హాజరు కాగా 2,920 మంది పాస్ అయ్యారని పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో 1033 మందిలో 658 మంది, ఎయిడెడ్‌లో 353 మందిలో 170 మంది, వెల్ఫేర్‌లో 113 మందిలో 76 మంది, కేజీబీవీల్లో 125 మందిలో 93 మంది, మోడల్ స్కూళ్లలో 262 మందిలో 179మంది, ప్రైవేట్‌లో 2,925 మంది విద్యార్థుల్లో 1744 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని స్పష్టం చేశారు. జిల్లాలో ఆత్మకూరు జూనియర్ కాలేజీ, కణేకల్లు జూనియర్ కళాశాలలు మరో ఏపీఎస్‌డబ్ల్యూఆర్ గర్ల్స్ జూనియర్ కాలేజ్, రెండు కేజీబీవీలు, రెండు, మోడల్ స్కూళ్లలో 100 శాతం రిజల్ట్స్ వచ్చినట్లు తెలిపారు.

చీనీకాయలు టన్ను రూ.30 వేలు

అనంతపురం రూరల్, జూన్ 18: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.30 వేలు, కనిష్ఠంగా రూ.11 వేలు, సరాసరి రూ.19 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మొత్తం 374 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

రానున్న ఐదు రోజుల్లో తేలిక పాటి వర్షాలు

బుక్కరాయసముద్రం, జూన్18: ఉమ్మడి జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో తేలిక పాటి నుంచి ఓ మోస్తారు వర్షం కురిసే అవకాశం ఉందని ఆచార్యఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తానారాయణ స్వామి తెలిపారు. పలు చోట్ల 1.0- 2.0 మి.మీ వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. నైరుతి దిశగా గంటకు 6.0 కి.మీ వేగంతో గాలులు వీస్తాయన్నారు.

- ప్రస్తుతం కురిసిన వర్షాలకు వర్షాధారంగా వేసే రైతులు అంతర పంటలు సాగు చేసుకోవాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ ప్రధాన శాస్త్రవేత్త సహదేవరెడ్డి సూచించారు. ప్రస్తుతం తేలిక పాటి నేలలో నేలను వాలుకు అడ్డంగా దున్ని పంటలను విత్తుకోవాలన్నారు. అరుతడి పంటలను బోదే మరియు సాళ్ల పద్ధతి లేదా ఎత్తు మడుల పద్ధతిలో విత్తుకోవాలన్నారు. తద్వారా పంటకు ఎక్కువ కాలం తేమ లభ్యమవుతుంది. పొలం గట్టుపైన కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలన్నారు. విత్తనం ద్వారా సంక్రమించే తెగుళ్లను అరికట్టాడానికి ప్రధాన పంటలైన వరి, మొక్క జొన్న , జొన్న, పెసర , కంది వేరుశనగ విత్తనాలను తెగళ్ల మందులతో విత్తన శుద్ధి చేసుకోవాలని రైతులకు సూచించారు.

కోమటికుంట్లలో టీడీపీ, వైసీపీ వర్గాల ఘర్షణ

పుట్లూరు, జూన్ 18: మండలంలోని కోమటికుంట్లలో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు సోమవారం రాత్రి వైసీపీ నాయకులు కవ్వింపు చర్యల నేపథ్యంలో ఘర్షణ జరిగింది. ఈ గొడవలో టీడీపీకి చెందిన చంద్ర, సి. శ్రీనివాసులునాయుడు, పి. శ్రీనివాసులునాయుడు, వైసీపీకి చెందిన ఎరుకలయ్య గాయపడ్డారు. వీరిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. టీడీపీకి చెందిన 8మంది, వైసీపీకి చెందిన 8మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ వెంకటశివారెడ్డి, సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ హేమాద్రి పరిశీలించారు.

గ్రామంలో పోలీసు కవాతు

సోమవారం రాత్రి టీడీపీ, వైసీపీ వర్గాలు ఘర్షణ జరగడంతో ముందస్తుగా కోమటికుంట్ల గ్రామంలో మంగళవారం పోలీసులు కవాతు నిర్వహించారు. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి ఆధ్వర్యంలో బీఎస్ఎఫ్ బలగాలతో గ్రామంలో కవాతు నిర్వహించారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఇష్టా రాజ్యంగా సుంకం వసూలు

- అసభ్య పదజాలంతో దూషణలు
- మార్కెట్‌లో ఆందోళనకు దిగిన రైతులు

హిందూపురం అర్బన్, జూన్ 18: పట్టణంలో సుంకం వసూలు దారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లేపాక్షి, చిలమత్తూరు మండలాల నుంచి రైతులు తాము పండించిన కొత్తిమీరను మంగళవారం తెల్లవారుజామున స్థానిక మార్కెట్‌కు తీసు కొచ్చి హోల్‌సేల్ విక్రయానికి పెట్టారు. అయితే మంజు అనే వ్యక్తి ఇష్టా రాజ్యంగా సుంకం వసూలు చేస్తున్నాడని రైతులు ఆందోళనకు దిగారు. అదే విధంగా అసభ్య పదజాలంతో దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఇంతకు ముందు కొత్తిమీర హోల్‌సేల్ వ్యాపారుల వద్ద నుంచి సుంకం రూ. 40 వసూలు చేసేవారని, ఇప్పుడు రూ. 80 నుంచి 120 వసూలు చేస్తున్నారని ఆవేదన చెందారు. అంతేగాకుండా రోడ్డుపక్కన గంపల్లో, తోపుడు బండ్లలో వ్యాపారం చేసే వారి వద్ద నుంచి రూ. 50 వరకు వసూలు చేస్తున్నారన్నారు. అడిగితే అసభ్యంగా దూషిస్తున్నాడని రైతులు వాపోయారు. మహిళా రైతుల పట్లకూడా దురుసుగా ప్రవర్తిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ నాయకులు రైతులకు అండగా నిలిచారు. మున్సిపల్ కమిషనర్ స్పందించి రైతులకు, వ్యాపారులకు అనుకూలంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల పట్ల, మహిళలపట్ల అసభ్యంగా వ్యవహరిస్తున్న సుంకం వసూలు దారుడిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.



అధిక సుంకం వసూలు చేస్తున్నట్లు రశీదు చూపుతున్న రైతులు

విచారించి చర్యలు తీసుకుంటాం

రైతులు, వ్యాపారులు, మహిళల పట్ల సుంకం దారులు దురుసుగా ప్రవర్తిస్తున్న విషయం నా దృష్టికి రాలేదు. విచారించి చర్యలు తీసుకుంటాం. అదే విధంగా పట్టణంలోని వ్యాపారా సముదాయాల వద్ద గెజిట్ ఏర్పాటు చేసి రైతులకు అనుకూలంగా మార్పు తీసుకొస్తాం.

\- శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

సంక్షిప్తంగా..

నేడు విద్యుత్ సరఫరా బంద్

అనంతపురంరూరల్, జూన్ 18: నగరంలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ టౌన్-1 డీఈఈ నాగేంద్ర తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఓబుళదేవరనగర్, విద్యుత్ నగర్, ఆదర్శనగర్, ఆరవిందనగ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

విత్తన వేరుశనగ పంపిణీ

అనంతపురం అర్బన్, జూన్ 18: జిల్లాలోని ఆర్బీకేల్లో 20వ రోజైన మంగళవారం విత్తన వేరుశనగ పంపిణీ కొనసాగింది. ఇప్పటి దాకా 79,456 మంది రైతులకు 72,366 క్వింటాళ్ల పంపిణీ చేశారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటిదాకా 83,010 మంది రైతులు 73,259 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కోసం తమ పేర్లు నమోదు చేసుకున్నారు.

ఉద్యోగులకు న్యాయం చేయాలి

అనంతపురం సెంట్రల్, జూన్ 18: జేఎన్‌టీయూలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల ఉద్యోగులకు న్యాయం చేసేలా టీడీపీ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆర్ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రాజకీయాలకు అతీతంగా పరిపాలన అందించాల్సిన జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు గత ఐదేళ్లలో రాజకీయాలకు అంటకాగుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల ఉద్యోగులపై వివక్షచూపారని వాపోయారు. ఉద్యోగుల అభ్యున్నతికి పాటుపడుతున్న ఎంబీ నాగభూషణంను బలవంతంగా ఉద్యోగ విరమణ చేయించారన్నారు. డీఈగా పనిచేస్తున్న శ్యాంబాబును క్యాడర్‌ను తగ్గించి రివర్స్ ఇచ్చారన్నారు. పారదర్శకంగా పనిచేసే అనేకమంది ఉద్యోగులను ట్రాన్స్‌ఫర్, డిమోషన్ తదితర చర్యలతో ఇబ్బందులకు గురిచేశారన్నారు. ఇప్పటికైనా నూతన ప్రభుత్వంలో బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

లారీ బోల్తా



గార్లదిన్నె, జూన్ 18 : స్థానిక శింగనమల రోడ్డు సమీపంలో మంగళవారం చీనీపండ్ల లారీ అదుపుతప్పి బోల్తా పడింది. గార్లదిన్నె నుంచి కోయంబత్తూరుకు చీనీపండ్ల లోడుతో వెళ్తున్న లారీ టైర్ పంచర్ కావడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలూ కాలేదు.

రేపటి నుంచి నైపుణ్య శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 18 : టూవీలర్ (బైక్) రిపేరీ కోర్సుపై ఉచిత శిక్షణను గురువారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. 45 రోజుల పాటు ఇచ్చే ఈ శిక్షణలతోపాటు ఇంగ్లీష్ నైపుణ్యం, కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసంపై కూడా శిక్షణ ఇస్తామన్నారు. 18-35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన పదో తరగతి, ఐటీఐ, ఇంటర్ చదివిన నిరుద్యోగ అభ్యర్థులు అర్హులన్నారు. శిక్షణా కాలంలో మధ్యాహ్న భోజనం ఉచితంగా అందజేస్తామని, టూల్ కిట్, సర్టిఫికెట్లు, అనంతర ఉపాధి కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు ఆర్డీటీ స్టేడియం ఎదురుగా ఉన్న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో నేరుగా లేదా సెల్ నంబర్లు 93905 05952, 77807 52418ను సంప్రదించాలన్నారు.

స్కియాడ్‌ను ప్రారంభించండి



ఎస్కేయూ వీసీకి వినతి పత్రం ఇస్తున్న సాకే హరి

అనంతపురం సెంట్రల్, జూన్ 18: పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇచ్చే శ్రీకృష్ణదేవరాయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అకడమిక్ డెవలప్‌మెంట్ ట్రైనీ సెంటర్ 'స్కియాడ్'ను పునఃప్రారంభించాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర నాయకుడు సాకేహరి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎస్కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేసిన ఆయన మాట్లాడారు. రూ.లక్షలతో నిర్మించిన స్కియాడ్ భవనాలు మొండిగోడలుగా మారిపోయాయని వాపోయారు. వేలాదిమంది విద్యార్థులను ఉద్యోగులుగా తీర్చిదిద్దిన స్కియాడ్ వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో పాడుబడిపోయిందన్నారు. స్కియాడ్‌కు గత వీసీ రామకృష్ణారెడ్డి నిధులివ్వకుండా అడ్డుకున్నారన్నారు. ఇప్పటికైనా భవనాలను మరమ్మత్తుచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురాకపోతే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, ఓబిలేసు, నారాయణస్వామి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్చెల్సీ మరమ్మతులకు ప్రతిపాదనలు పంపండి

అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

గార్లదిన్నె, జూన్ 18: హెచ్చెల్సీ దక్షిణ కాలువ లీకేజీలు, మరమ్మతులపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి అధికారులను ఆదేశించారు. మండలంలోని ఎంపీఆర్, దక్షిణ కాలువలను మంగళవారం ఆమె ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డితో కలిసి పరిశీలించారు. దక్షిణ కాలువకు అక్కడక్కడ లీకేజీలు ఉన్నట్లు హెచ్చెల్సీ అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే స్పందిస్తూ... గేట్లకు అవసరమైన రబ్బర్లు, గ్రీసు, డ్యాంకు అవసరమైన మరమ్మతులకు నివేదికలు తయారు చేయాలని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. భవిష్యత్‌లో రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి వృథాను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్చెల్సీ ఈఈ రమణారెడ్డి, ఏఈ సురేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ముంటిమడుగు శ్రీనివాసరెడ్డి, మాజీ జడ్పీటీసీలు విశాలాక్షి, గుర్రం ఆదినారాయణ, నాయకులు గేట్ కృష్ణారెడ్డి, రామన్న చౌదరి, గుత్తా బాలకృష్ణ, వడ్డే వన్నూరు, సుంకన్న, నరసింహారెడ్డి, చిదంబరప్ప, బాబయ్య, రమణప్ప, సుధాకర్‌రెడ్డి, గుత్తా హరి, చల్లా నాగరాజు, రామకృష్ణ పాల్గొన్నారు.



ఎంపీఆర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

చెత్త తొలగించారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 18 : స్థానిక హౌసింగ్‌బోర్డు, హమాలీకాలనీ, నవోదయ కాలనీలలో పది రోజులుగా చెత్త తొలగించలేదు. దీనిపై మంగళవారం ఆంధ్రజ్యోతి ఓ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన నగరపాలక సంస్థ అధికారులు ఆ చెత్తను ట్రాక్టర్లు, ఇతర వాహనాల్లో తరలించారు. ఈ ప్రాంతాన్ని శుభ్రం చేశారు.

మూడు రోజుల్లో గుంతను పూడ్చివేయిస్తాం

రాప్తాడు, జూన్ 18: మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీ పరిధిలో ఇందిరమ్మ కాలనీలో చిన్మయ్‌నగర్- 1వ అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో భారీ గుంత ఉంది. తద్వారా పిల్లలు ప్రమాదానికి గురయ్యే అవకాశముందని ఆంధ్రజ్యోతి మంగళవారం ఓ కథనాన్ని ప్రచురించింది. అందుకు స్పందించిన ఐసీడీఎస్ సీడీపీఓ ధనలక్ష్మి, సూపర్‌వైజర్లు నాగరత్న, హేమలత అంగన్‌వాడీ కేంద్రం పక్కన ఉన్న గుంతను పరిశీలించారు. ఆలయ ప్రహరీ కోసం గుంత తవ్విన వారిని అక్కడికి పిలిపించారు. వెంటనే గుంతను పూడ్చి వేయాలని తెలిపారు. దీంతో మూడు రోజుల్లోపు పూడ్చివేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.





అనంతపురంలో చెత్త తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు, ఇందిరమ్మ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద గుంతను పరిశీలిస్తున్న సీడీపీఓ

మంత్రులకు పలువురి శుభాకాంక్షలు





మంత్రి సత్యకుమార్‌ను కలిసిన టీడీపీ ముఖ్య నాయకులు, మంత్రి కేశవ్‌కు అభినందనలు తెలుపుతున్న ట్రెజరీ ఉద్యోగుల సంఘం నేతలు

అనంతపురం అర్బన్, జూన్ 18: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు టీడీపీ ముఖ్యనాయకులు శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం స్థానిక బీజేపీ జిల్లా అధ్యక్షుడి నివాసంలో మంత్రి సత్యకుమార్‌ను టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, ఎంపీలు బీకే పార్థసారధి, అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అనంతపురం టౌన్ : ఆర్థికశాఖా మంత్రి పయ్యావుల కేశవ్‌కు ట్రెజరీ ఉద్యోగుల సంఘ నాయకులు మంగళవారం శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక మంత్రి స్వగృహంలో ఫైనాన్స్, ట్రెజరీ సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంటు పెనుబోలు శంకరనారాయణ, జిల్లా ఉపఖజానా అధికారి బోయపాటి అనంతయ్య మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

అనంతపురం క్రైం: రాష్ట్ర ఆర్థిక, పన్నుల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను పన్నుల శాఖ ఎన్‌జీఓ సంఘం నాయకులు కలిశారు. మంగళవారం మంత్రిని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్‌బాబు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అటిజం పిల్లలపై మానవత్వం చూపండి : జేసీ

అనంతపురం టౌన్, జూన్ 18: వివిధ లోపాలతో (అటిజం) పుట్టిన పసిపిల్లల పట్ల మానవత్వం చూపాలని వైద్యులకు జాయింట్ కలెక్టరు కేతన్‌గార్గ్ సూచించారు. మంగళవారం జిల్లా ఆస్పత్రి ఆవరణంలోని డీఈఐసీ సెంటర్‌లో నిర్వహించిన అటిష్టిక్ ప్రైడ్ డే కార్యక్రమానికి వివిధ రకాల లోపాలతో జన్మించిన పిల్లలను వారి తల్లిదండ్రులను తీసుకొచ్చారు. దాతలు సహకారంతో ఆ పిల్లలకు అవసరమైన వివిధ రకాల పరికరాలను జేసీ అందజేశారు. చికిత్సా కేంద్రంలో అటిజం పిల్లలకు వైద్య సేవలు అందిస్తూ సాధారణ పిల్లలుగా తయారు చేయడం అభినందనీయమన్నారు. డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ.బీ. దేవి, వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు, సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడారు. అటిజం పిల్లల పట్ల తల్లిదండ్రులు సరైన శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆ పిల్లలకు ఇష్టమైన ఆటలు, విద్య పట్ల ప్రోత్సహించాలని, తద్వారా ఆ పిల్లలలో మానసిక.. శారీరక ఎదుగుదల ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంఓలు పద్మజ, హేమలత, జనరల్ సర్జన్ హెచ్ఓడీ రామస్వామినాయక్, వైద్యనాథ్, ప్రోగ్రామ్ ఆఫీసర్ నారాయణస్వామి, డీఈఐసీ మేనేజరు రజిత పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో అనంత, చిత్తూరు విజయం

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 18: సౌత్‌జోన్ క్రికెట్ పోటీల్లో అనంతపురం, చిత్తూరు జట్లు విజయం సాధించాయి. మంగళవారం స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో అంతర్-23 ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ క్రికెట్ పోటీలు కొనసాగాయి. కర్నూలు, అనంతపురం జట్లు తలపడగా... మొదట బ్యాటింగ్ చేసిన అనంతపురం 38.1 ఓవర్లలో 172 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇందులో యోగానంద 55 పరుగులు చేశాడు. అనంతరం బరిలోకి దిగిన కర్నూలు 48 ఓవర్లలో 161 పరుగులకే ఆలౌట్ అయ్యింది. అనంతపురం 11 పరుగుల తేడాతో సాధించిన విజయంలో అర్జున్ టెండూల్కర్ 50 పరుగులు చేసి మూడు వికెట్లు తీసి ప్రతిభచూపాడు. మరో మ్యాచ్‌లో నెల్లూరు, చిత్తూరు జట్లు పోటీ పడగా.... మొదట బ్యాటింగ్ చేసిన నెల్లూరు నిర్ణీత 50 ఓవర్లలో ఎనిమిది వికెట్లు కోల్పోయి 274 పరుగులు చేసింది. ధరణికుమార్ ఐదు వికెట్లు తీశాడు. అనంతరం బరిలోకి దిగిన చిత్తూరు 49 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 278 పరుగులు చేసి గెలుపొందింది. చిత్తూరు బ్యాటర్ రుషిల్ రెడ్డి 71 పరుగులు, ధరణికుమార్ 73 పరుగులు, శశాంక్‌శ్రీవాస్తవ్ 75 పరుగులు సాధించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి, సెలెక్టర్లు శ్రీహరి, వెంకటేష్, నాగినికుమార్, విజయశేఖర్ పాల్గొన్నారు.



టెంకాయలు కొడుతున్న టీడీపీ నాయకుడు సర్దార్ వలి

మొక్కు తీర్చుకున్న మంత్రి కేశవ్ అభిమాని

అనంతపురం అర్బన్, జూన్ 18: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రిగా పయ్యావుల కేశవ్ నియమితులుకావడంతో అనంతపురం అర్బన్‌కు చెందిన టీడీపీ నాయకులు ముత్యాలమ్మకు మొక్కుతీర్చుకున్నారు. మంగళవారం స్థానిక గౌరవహోమ్స్ వద్ద ముత్యాలమ్మ ఆలయంలో టీడీపీ నాయకులు సర్దార్ వలి ఆధ్వర్యంలో 101 టెంకాయలు కొట్టారు. కార్యక్రమంలో జల్లిపల్లి వన్నూరుస్వామి, శేక్షావలి, జనశక్తి నగర్‌కు చెందిన బుల్లెట్ బాబు, లాలు సాబ్, అనిమిరెడ్డిపల్లి చిన్న దాదా, మల్లిక, గోవిందాచారి, సంజీవరాయుడు, ఇమాంబి, నబీరసూల్ పాల్గొన్నారు.

ఎంహెచ్‌ఓను వెంటనే బదిలీ చేయాలి

కార్మికుల డిమాండ్.. నగరపాలికలో సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

అనంతపురం క్రైం, జూన్ 18: మహిళా కార్మికులతో అసభ్యంగా మాట్లాడుతున్న ఎంహెచ్ఓ విష్ణుమూర్తిని వెంటనే మార్చాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు, కోవిడ్, మలేరియా, గార్బేజ్, క్లాప్ ఆటో డ్రైవర్లు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఇందులో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణ, సీఐటీయూ నగర కార్యదర్శి వెంకటనారాయణ, జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు మాట్లాడారు. గతంలో ఏ ఎంహెచ్ఓ కార్మికుల పట్ల ఇలా అసభ్యంగా మాట్లాడలేదన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్మికులకు బకాయి వేతనాలతో పాటు ఇంక్రిమెంట్లు ఇవ్వాలన్నారు. నగర ప్రజలకు అనుకూలంగా కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. అనంతరం కమిషనర్ మేఘస్వరూప్‌కు వినతిపత్రం అందజేశారు. కమిషనర్ మాట్లాడుతూ... ఎంహెచ్ఓపై చర్యలు తీసుకుంటామని, కొత్త ఎంహెచ్ఓను నియమిస్తానని అన్నారు. పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఉద్యోగ కార్మిక సంఘం నగర అధ్యక్ష, కార్యదర్శులు ముత్తరాజు, నల్లప్ప, మల్లికార్జున, రాయుడు, లక్ష్మీనారాయణ, బత్తల ఆదినారాయణ పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



పుష్ప పాటకు నృత్యం చేస్తున్న కళాకారులు

అనంతపురంరూరల్, జూన్ 18: బక్రీద్ పండుగను పురస్కరించుకుని మండలంలోని శిల్పారామంలో మంగళవారం నిర్వహించిన నృత్య ప్రదర్శనలు వీక్షకులను అలరించాయి. గుత్తికి చెందిన ఆర్ఆర్ డ్యాన్స్ అకాడమీ డ్యాన్స్ మాస్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో పలు సినిమా పాటలకు నృత్యప్రదర్శనలు ప్రదర్శించారు. కౌశిక్, హర్ష, వెంకటేష్, రాహుల్, మురారి భార్గవ్, తిరుమల సాయి, భార్గవ్‌నాయుడు, చంద్రశేఖర్, శర్వానంద్, సౌమ్య, నాగాలీల, రితిక, దేవిప్రియా, సాయి హిమ చంద్రిక తదితర కళాకారులు నృత్యం చేశారు. ఈకార్యక్రమంలో శిల్పారామం ఏఓ క్రిష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పాటలకు ప్రజలు ఈలలు, కేకలు వేస్తూ ఉల్లాసంగా గడిపారు. బక్రీద్ పండుగా మరుసటి రోజు ముస్లింలు విహార యాత్రకు వెళ్లడం ఆనవాయితీ. ఈక్రమంలో నగరంతోపాటు.. చుట్టుపక్క ప్రాంతాల నుంచి ముస్లింలు శిల్పారామంకు వచ్చారు. వారితో శిల్పారామంలో సందడి నెలకొంది. శిల్పారామంలో కుటుంబ సభ్యులంతా కలసి భోజనాలు చేశారు.

అనుమతి లేని కళాశాలలను సీజ్ చేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

అనంతపురం విద్య, జూన్ 18: జిల్లాలో అనుమతిలేని కళాశాలలను వెంటనే అధికారులు సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం గుత్తి రోడ్డులోని ఓ కళాశాల వద్ద ఆ సంఘం నాయకులు నిర్వహించిన ధర్నాలో జిల్లా కార్యదర్శి పరమేష్ మాట్లాడారు. జిల్లాలో అనుమతుల్లేని కళాశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయన్నారు. అనుమతి లేకుండానే... అడ్మిషన్లు తీసుకుంటూ... లక్షలాది రూపాయలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్నారన్నారు. అంతేకాకుండా కళాశాలల పేరుతో పుస్తకాలు ముద్రించి అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. వాటిపై ఇంటర్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల అక్రమ వ్యాపారానికి కళ్లెం వేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిద్ధు, తరిమెల గిరి, నగర అధ్యక్ష, కార్యదర్శులు శివ, భీమేష్, నాయకులు సోము, వివేక్, రాజేష్, నిరంజన్, మహేష్ పాల్గొన్నారు.

బధిర, మూగ చిన్నారులకు 'అమ్మ' అండ



రూ.2.70 లక్షల చెక్కును అందజేస్తున్న రమణారెడ్డి

అనంతపురం కల్చరల్, జూన్ 18: అనంతపురం నగరానికి చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల్లోని 15 మంది బధిర, మూగ చిన్నారులకు అమ్మ సంస్థ అండగా నిలిచింది. పుట్టుకతోనే మాటలు రాకపోవడంతోపాటు వినికిడిలోపంతో బాధపడుతున్న ఈ చిన్నారులకు మైసూర్‌కు చెందిన ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ బాలగోపాల్‌తో పరీక్షలు నిర్వహించింది. వీరికి హియరింగ్ ఎయిడ్ ఏర్పాటు చేయడంతోపాటు కొన్ని సర్జరీల ద్వారా వారికి మాటలు కూడా రప్పించేందుకు ఒకొకరికి రూ.18వేలు చొప్పున మొత్తం రూ.2.70 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు సూచించారు. దీంతో మంగళవారం అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి ఆ చిన్నారులను కలిసి రూ.2.70 లక్షల చెక్కును అందజేశారు. భవిష్యత్‌లోనూ ఈ చిన్నారుల విద్యాభ్యాసానికి అయ్యే ఖర్చులను తామే భరిస్తామని రమణారెడ్డి హామీ ఇచ్చారు.

నవజాత శిశువుల కోసం...



స్వెటర్లు, మ్యాట్లు అందజేస్తున్న దాత

బెంగుళూరులోని జైన్ జూనియర్ కాలేజీలో చదువుతున్న స్నేహాన్స్ తన పాకెట్ మనీ రూ. 5,500లతో స్థానిక బాలసదన్‌లోని నవజాత శిశువుల కోసం స్వెటర్లు, స్లీపింగ్ మ్యాట్స్ అందజేశారు. వాటిని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవికి అందజేశారు. కార్యక్రమంలో సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్, శిశుగృహ మేనేజర్ దీప్తి, లక్ష్మి, లక్ష్మినా రాయణ, ట్రస్టు సభ్యులు దీప, నారాయణనాయక్, రాఘవేంద్ర, రాజేంద్ర పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన ఇంటర్ మినిస్టీరియల్ బృందం



రితీష్ చౌహాన్‌తో కలెక్టర్

అనంతపురం అర్బన్, జూన్ 18: కేంద్ర ప్రభుత్వ ఇంటర్ మినిస్టీరియల్ బృందం సభ్యులు మంగళవారం రాత్రి 10.20 గంటలకు జిల్లాకు చేరుకున్నారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో అనంత జిల్లాలో పర్యటించనున్న ఒకటో బృందం టీం లీడర్ కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ రితీష్ చౌహాన్, సభ్యులు పొన్నుస్వామి, సునీల్‌దుబే బస చేశారు. ఒకటో బృందం టీఎం లీడర్ రితీష్ చౌహాన్‌కు కలెక్టర్ వినోద్‌కుమార్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

ఫోన్ కాల్‌తో విద్యుత్ సమస్య పరిష్కారం

అనంతపురం రూరల్, జూన్ 18: నగరంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధికారులు పలు చర్యలు తీసుకున్నారు. దీనిపై అనంతపురం డివిజన్ ఈఈ జేవీ రమేష్ మాట్లాడుతూ.. నగరంలోని అన్ని విద్యుత్ సెక్షన్ కార్యాలయాల్లో సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారన్నారు. ఏ సమస్య వచ్చినా.. ఫోన్ చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో కేవలం ల్యాండ్ నెంబర్లు మాత్రమే అందుబాటులో ఉండేవని, ప్రస్తుతం మొబైల్ నెంబర్లను కూడా వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. వాటి వివరాలు ఇలా ఉన్నాయి..

డి-1 సెక్షన్.. (పవర్ ఆఫీస్)
ఆఫీసు నెంబరు: 08554 278699, సెల్ నెంబరు: 73826 05301, ఏఈఈ నెంబరు :94408 13241
ప్రాంతాలు: ఉమానగర్, బంగారువీధి, రాజురోడ్డు, సూర్యనగర్, ఖాజానగర్, సంఘమేష్ సర్కిల్, మరవకొమ్మకాలనీ, అనంతసాగర్ కాలనీ, బోయవీధి, రాణినగర్, తిలక్‌రోడ్డు, గుత్తిరోడ్డు, ఉమానగర్, భవాణినగర్, గిరిప్రసాద్, ముసలమ్మకట్ట, వీరభద్రకాలనీ, కేవీఎస్‌నగర్, దక్షిణంమూర్తి నగర్, ఏబీనగర్, మున్నానగర్, ఆసార్‌వీధి, బాపనవీధి, ఓల్డ్ సిడి ఆస్పత్రి, గాంధీబజార్, తాడిపత్రిరోడ్డు.

డి-2సెక్షన్.. (ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఎదుట)
ఆఫీసు నెంబరు:08554 220345, సెల్ నెంబరు: 73826 05302, ఏఈఈ నెంబరు : 94408 13242
ప్రాంతాలు: కమాలనగర్, ఆదిమూర్తినగర్, రాజురోడ్డు, మల్లేశ్వరీరోడ్డు, ప్రకాష్‌రోడ్డు, రహమత్‌నగర్, బాబానగర్, అరవిందనగర్, సాయినగర్ జీరోక్రాస్, ప్రభుత్వఆస్పత్రిరోడ్డు, శ్రీనివాసనగర్, రైల్వేఫీడర్‌రోడ్డు, వెంకటరెడ్డికాలనీ, లెక్చరర్స్‌కాలనీ, ఎర్నాలకొట్టాల, రామచంద్రనగర్, షిర్డినగర్, గుల్జార్‌పేట, సుభాష్‌రోడ్డు.

డి-3సెక్షన్..(బళ్లారి రోడ్డులోని సబ్‌స్టేషన్ ఆవరణం)
ఆఫీసు నెంబరు:08554 276567, సెల్ నెంబరు: 73826 05303, ఏఈఈ నెంబరు: 94408 13243
ప్రాంతాలు: గంగానగర్, హెచ్ఎల్‌సీ కాలనీ, ఆర్‌కేనగర్, గౌవర్‌గార్డెన్, మొదటి రోడ్డునుంచి 6వరోడ్డు, హనుమాన్‌కాలనీ, సత్యసాయినగర్, త్రీటౌన్ పోలీస్‌స్టేషన్, ప్రహ్లాద నగర్, రుద్రంపేట, కళ్యాణదుర్గంరోడ్డు, జన్మభూమి రోడ్డు, కొవ్వూరునగర్, ఆజాద్‌నగర్, కమ్మభవన్, ఆదర్శనగర్, నాల్గవ పట్టణపోలీస్‌స్టేషన్ ప్రాంతాలు, మారుతినగర్, సంఘమిత్రకాలనీ, సవీరాఆస్పత్రి, శ్రీనగర్‌కాలనీ, 80అడుగులరోడ్డు, ఎన్‌హెచ్44, పాత ఆర్టీఓ ఆఫీస్, మంగళవారి కాలనీ, రాంనగర్.



డి-2 సెక్షన్ కార్యాలయం

డి-4సెక్షన్..(మిస్సమ్మ బంగ్లా కాంపౌండ్, జీసెస్‌నగర్)
ఆఫీసు నెంబరు:08554 221347, సెల్ నెంబరు: 73826 05304, ఏఈఈ నెంబరు:94408 13244
ప్రాంతాలు: రామకృష్ణకాలనీ, సుశీలరెడ్డికాలనీ, ఇందిరమ్మకాలనీ, చిన్మయినగర్, శారదనగర్, నేతాజీ నగర్, ఎల్ఐసీకాలనీ, నారాలోకేష్‌కాలనీ, విద్యానగర్, పిఆర్‌కాలనీ, మహిళప్రాంగణం, విజయనగర్‌కాలనీ, నాయక్‌నగర్, ఆదర్శనగర్, హమాలీకాలనీ, హౌసింగ్‌బోర్డు, బుడ్డప్ప నగర్, బైరవనగర్, విద్యుత్ శక్తినగర్-2, న్యూరెవెన్యూకాలనీ, స్టేట్‌బ్యాంకు కాలనీ, ఆశోక్‌నగర్, డ్రైవర్స్‌కాలనీ, సాయినగర్, బెంగుళూరురోడ్డు, ఆర్‌డిటి ఆఫీస్, ఫెర్రర్‌నగర్, హౌసింగ్‌బోర్డు, వెంకటేశ్వరనగర్, నవోదయకాలనీ, మిస్సమ్మకాలనీ, ఎన్‌టీఆర్‌కాలనీ, లెనిన్‌నగర్, శివకోటి, జీసస్‌నగర్, విద్యుత్ నగర్, ఓబులదేవనగర్, కృపానందనగర్, కళాకారులకాలనీ,సెవెన్‌హిల్స్ కాలనీ.

డి-5ససెక్షన్.. (బళ్లారి రోడ్డు, సబ్‌స్టేషన్ ఆవరణం)
ఆఫీసు నెంబరు:08554 270352, సెల్ నెంబరు: 73826 05305, ఏఈఈ నెంబరు: 94408 13245
ప్రాంతాలు: జనశక్తినగర్, తపోవనం, సోమనాథ్‌నగర్, రజాక్‌కాలనీ, యువజన కాలనీ, ఎఎస్‌ఆర్‌నగర్, మహదేవ్‌నగర్, రాయల్‌నగర్, ప్రియాంకనగర్, భగత్‌సింగ్‌నగర్, ప్రకాష్‌రావు నగర్, నవయుగకాలనీ, స్టాలిన్‌నగర్, ఆంజనేయనగర్, హనుమంతనగర్, లలితనగర్, బాలాజీనగర్, నారాయణపురం, గణేష్‌నగర్, విద్యారణ్యనగర్, విద్యానగర్, పాపంపేట, జొన్నవీరయ్య కాలనీ, బాగ్యనగర్, ఎస్‌సిఐకాలనీ, నందమూరి నగర్, పిల్లిగుండ్లకాలనీ, ఐజినగర్, ద్వారకవిలాస్, బాలాజీ విలాస్, ఓంనగర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, బళ్లారిరోడ్డు, పవర్‌డాబా రోడ్డు, ఇందిరమ్మకాలనీ, ఐటిఐ కాలనీ, గోవర్ధన్‌నగర్, పంతులకాలనీ, విమలాఫరూక్‌నగర్, సైఫూల్లాకొట్టాల, డిమార్ట్ రోడ్డు, ఆలమూరు రోడ్డు, సివిఆర్‌నగర్, దండోరకాలనీ, వికలాంగులకొట్టాల, మండ్ల సుబ్బయ్యకాలనీ, గౌతమివిలాస్, వెంకటస్వామి నగర్, అమరావతినగర్, జాకీర్‌కొట్టాల, గౌరవ్‌హోమ్స్.

డి-6సెక్షన్.. (అనంతపురం వ్యవసాయామర్కెట్ యార్డు పక్కన, గుత్తిరోడ్డు)
ఆఫీసు నెంబరు:08554 232345, సెల్ నెంబరు: 73826 05306, ఏఈఈ నెంబరు: 94910 67583
ప్రాంతాలు: వేణుగోపాల్‌నగర్, ఆర్టీసీ బస్టాండ్, భాగ్యనగర్, ఫెర్రర్ కాలనీ, వినాయక్‌నగర్, నారాయణరెడ్డికాలనీ, జనచైతన్యకాలనీ, ఎల్‌బి నగర్, ఆర్‌ఆర్‌సికాలనీ, హమాలీకాలనీ, గాయత్రికాలనీ, సాకలి ఐలమ్మకాలనీ, బిందెలకాలనీ, విరుపాక్షినగర్, గుజ్జలసరళదేవికాలనీ, కల్పనజోషికాలనీ, శర్మాస్‌కాలనీ, టీచర్స్‌కాలనీ, రామయ్యకాలనీ, రిక్షా కాలనీ, రాజీవ్‌కాలనీ, తారకరామకొట్టాలు. గుత్తిరోడ్డు, ఎస్సీ కాలనీ, రామిరెడ్డి కాలనీ,భాగ్యనగర్ ప్రాంతాలు.

మంత్రికి నెట్టికంటి చిత్రపటం బహూకరణ



మంత్రి పయ్యావులకు నెట్టికంటి చిత్రపటాన్ని బహూకరిస్తున్న కసాపురం ఆలయ అధికారులు

గుంతకల్లు, జూన్ 18: రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు కసాపురం దేవస్థాన అధికారులు మంగళవారం నెట్టికంటి చిత్రపటాన్ని బహూకరించారు. మంగళవారం ఉదయం అనంతపురంలోని కేశవ్ ఇంటికి వెళ్లిన దేవదాయ శాఖ అధికారులు ఆయనకు శుభాకాంక్షలను తెలిపారు. అనంతరం శాలువ, పూల మాలతో సన్మానించి నెట్టికంటి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తల మండలి ఛైర్‌పర్సన్ కే సుగుణమ్మ, ఈఓ భద్రాజీ, ఏఈఓ మల్లికార్జున, పీ వెంకటేశులు, ప్రధాన అర్చకులు గరుడాచార్యులు, రాఘవాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి గజమాలతో సత్కారం



మంత్రిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ఉరవకొండ, జూన్ 18: రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి నియోజకవర్గానికి విచ్చేసిన మంత్రి పయ్యావుల కేశవ్‌ను టీడీపీ నాయకులు ప్యారంకేశవానంద, గోవిందు, రెడ్డిమాసి రవీంద్ర, సత్య గజమాలతో సత్కరించారు. మండలంలోని కౌకుంట్ల గ్రామంలో మంత్రిని కలిసి అభినందనలు తెలిపారు. ఆయనతో పాటు ఉద్యోగులు, మంత్రిని సన్మానం చేశారు.

ఎర్రితాత స్వామిని దర్శించుకున్న మంత్రి కేశవ్

మండలంలోని వై. రాంపురంలోని ఎర్రితాతస్వామిని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మంగళవారం దర్శించుకున్నారు. మంత్రికి అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో మంత్రి పేరిట ప్రత్యేక పూజలు చేశారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో మరమ్మతులు పూర్తి చేయండి



హెచ్చెల్సీ అధికారులతో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

బొమ్మనహాళ్, జూన్ 18: తుంగభద్ర హెచ్చెల్సీ కాలువకు పడిన గండ్లు, కూలిన యూటీ చానళ్లకు సకాలంలో మరమ్మతులు చేయించి ఆయకట్టుకు సాగునీటిని అందించాలని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. మంగళవారం హెచ్చెల్సీ ఈఈ రమణారెడ్డి, కణేకల్లు హెచ్చెల్సీ డీఈ మద్దిలేటితో ఆయన సమావేశం నిర్వహించారు. అత్యవసర మరమ్మతు పనులకు ప్రతిపాదన తయారు చేసి ప్రభుత్వానికి పంపాలని ఆదేశించారు. అలాగే కూలిపోయిన కల్వర్టుల నిర్మాణం కోసం ప్యాకేజీ నిధుల్లో కాకుండా విడివిడిగా ప్రతి పాదనలు తయారు చేయాలన్నారు. కణేకల్లు చెరువు వద్ద గంగలాపురం - రచ్చుమర్రి కూలిన బ్రిడ్జిని ప్రత్యేకంగా ప్రతిపాదన రిపోర్టు తయారు చేసి ప్రభుత్వానికి పంపాలని వారికి ఆదేశించారు. కార్యక్రమంలో జేఈ అల్తాఫ్ కూడా పాల్గొన్నారు.

సప్లిమెంటరీలో వందశాతం ఉత్తీర్ణత

కుందుర్పి, జూన్ 18: ఇంటర్మీడియట్ రెండో సంవత్సరంలో జరిగిన సప్లిమెంటరీ పరీక్షలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ క్రిష్ణమూర్తి పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు 36 మంది మొత్తం ఉత్తీర్ణులైనట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా కస్తూర్బా బాలికల పాఠశాలలో కూడా వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎస్‌వో నిర్మల తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌కు అడ్మిషన్లు జరుగుతున్నాయి. విద్యార్థులకు అన్ని గ్రూపులు అందుబాటులో ఉన్నాయని ఆసక్తి గలవారు అడ్మిషన్ల కొరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అనుమానంతో భార్యపై దాడి

గుంతకల్లుటౌన్,జూన్18: పట్టణంలోని దోనిముక్కల రోడ్డులోని సుంకలమ్మ కాలనీలో నివాసం ఉండే మల్లేశ్వరిపై ఆమె భర్త రంగన్న మంగళవారం బ్లేడ్లతో దాడి చేశాడు. బాధితురాలు తెలిపిన మేరకు మల్లేశ్వరికి పెయింటర్‌గా పనిచేస్తున్న రంగన్నతో 12 సంవత్సరాల కిందట వివాహం అయ్యింది. అప్పటి నుంచి కూడా అనుమానంతో రోజు గొడవ పడేవాడన్నారు. గతంలో కూడా ఒకసారి కొడవలితో దాడికి యత్నించాడన్నారు. ఈవిషయంపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. గొడవల విషయంగా మంగళవారం ఉదయం తన పుట్టింటివారు, భర్త తరపు బంధువులు పంచాయితీ చేశారన్నారు. ఈక్ర మంలో తనకు భర్త వద్దు అని చెప్పినట్లు బాధితురాలు పేర్కొన్నారు. దీంతో మధ్యాహ్నం ఇంట్లో ఉన్న మల్లేశ్వరిపై బ్లేడుతో రంగన్న దాడి చేశాడన్నారు. మెడపైన గాయం కావడంతో కుటుంబసభ్యులు ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

మరమ్మతులు జరిగేనా ?

తాడిపత్రిటౌన్, జూన్ 18: గత వైసీపీ పాలకుల పాపం శాపంగా మారి పట్టణ ప్రజలను వేధిస్తోంది. పనులు నాణ్యతగా చేయకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇందుకు పట్టణంలోని భూగర్భ డ్రైనేజీ వ్యవస్థే నిదర్శనం. స్థానిక సీపీఐ కాలనీ సమీపంలో ఉన్న అండర్‌డ్రైనేజీ ఎస్టీపీ-1లో పైపులు పగిలిపోయి పదిరోజులు కావస్తున్నా మరమ్మతు పనులపై అధికారులు స్పందించడం లేదు. దీనిపై స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ పాలనలో పట్టణంలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. భూగర్భ డ్రైనేజీ నిర్వహణను గాలికి వదిలివేయడంతో ఎస్టీపీ-2 పైపుల్లో కూడా చెత్త పేరుకుపోవడంతో మురుగు నీరు ముందుకు కదలడం లేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో మున్సిపల్ అధికారులు అండర్‌డ్రైనేజీ వాటర్‌ను పెన్నానదిలోకి వదులుతున్నారు. గత మూడు రోజుల నుంచి వరుసగా వర్షాలు పడుతుండటంతో నీటి ఉధృతి పెరిగింది. డ్రైనేజీనీటితో పాటు వర్షపునీరు కలుస్తుండడంతో పట్టణంలోని పలువీధుల్లో అండర్ డ్రైనేజీ చాంబర్ల నుంచి నీరు బయటకు వస్తూ దుర్గంధం వెదజల్లుతోంది.

- పది రోజుల కిందట పగిలిపోయిన ఎస్టీపీ-1 పైపులు
- ఎస్టీపీ-2 పైపుల్లో పేరుకుపోయిన చెత్త
- భూగర్భ డ్రైనేజీ చాంబర్ల నుంచి బయటి వస్తున్న మురుగునీరు
- గతిలేక పెన్నానదిలోకి అండర్ డ్రైనేజీ నీరు విడుదల
- పైపుల నాణ్యత విషయంలో దృష్టి పెట్టని గత ప్రభుత్వం

పెన్నానదిలోకి డ్రైనేజీ నీరు

రెండేళ్లక్రితం మరమ్మతుల పేరుతో అండర్‌డ్రైనేజీ నీటిని పెన్నానదిలోకి వదిలి ప్రజా ఆరోగ్యంతో వైసీపీ పాలకులు చెలగాటమాడారు. అండర్‌డ్రైనేజీ నీరు నదిలోకి పంపడం పట్ల ప్రజల నుంచి తీవ్రవిమర్శలు వ్యక్తమయ్యాయి. ప్రస్తుతం ఎస్టీపీ-1లో సమస్య తలెత్తడంతో మరోసారి మున్సిపల్ అధికారులు డ్రైనేజీనీటిని నదిలోకి వదిలారు. దీంతో పట్టణవాసుల కష్టాలు మొదటికి వచ్చాయి. ఇప్పటికే తాగునీరు సరిగా రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు మరోసారి అండర్‌డ్రైనేజీ వాటర్ కలుస్తుండటంతో తిప్పలు తప్పేలా లేవు.



పెన్నానదిలోకి వదిలిన అండర్‌డ్రైనేజీ నీరు

రెండేళ్లకే పగిలిన పైపులు

ఎస్టీపీ-1 వద్ద పైపులకు మరమ్మతులు చేపట్టి రెండేళ్ల తిరగకముందే మరోసారి పైపులు పగిలిపోయాయి. వీటికి మరమ్మతులు చేపట్టాలన్న ఆలోచన కూడా గత పాలకులకు రాకపోవడం గమనార్హం. దీంతో ప్రజా క్షేమం కోసం సొంత నిధులు వెచ్చించి అప్పట్లో టీడీపీ మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఎస్టీపీ-1 వద్ద మరమ్మతు పనులు చేయిస్తుండగా వైసీపీ వర్గీయులు అడ్డుకున్నారు.



ఎస్టీపీ-1 వద్ద పైపులు పగిలిపోవడంతో అండర్‌డ్రైనేజీ నీరు లీకవుతున్న దృశ్యం

కౌన్సిల్ మీట్ తప్పదా ?

ఎస్టీపీ-1లో నెలకొన్న మరమ్మతు పనులు చేయడానికి కౌన్సిల్‌మీట్ పెట్టక తప్పదా అంటే అవుననే సమాధానం వస్తోంది. సాధారణంగా రూ.2లక్షలలోపు ఖర్చు ఉంటే మున్సిపల్ కమిషనర్ ఆదేశాలను జారీ చేయవచ్చు. ఖర్చు ఎక్కువగా ఉంటే మాత్రం కౌన్సిల్‌మీట్ ఏర్పాటుచేసి సభ్యుల ఆమోదం తెలపాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఇప్పట్లో ఇది జరిగేనా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడం, తాడిపత్రిలో జేసీ అస్మిత్‌రెడ్డి గెలిచినప్పటికి వారు తాడిపత్రి నియోజకవర్గంలోకి రాకూడదన్న కోర్టు ఆదేశాల మేరకు అనంతపురంలో ఉంటున్నారు. దీంతో మరమ్మతు పనులు ఎప్పుడు, ఎలా జరుగుతాయో వేచి చూడక తప్పని పరిస్థితి.

- దీనిపై మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్‌ను వివరణ కోరగా తన పరిధిలో రూ.2లక్షలలోపు ఖర్చు పెట్టే అవకాశం ఉందన్నారు. అంతకుమించి ఖర్చు చేయాలంటే కౌన్సిల్ మీట్ అనుమతి కావాల్సి ఉంటుందన్నారు. భూగర్భ డ్రైనేజీ మరమ్మతు పనులకు భారీ మొత్తం ఖర్చు అయ్యే అవకాశం ఉంది. కావున కౌన్సిల్‌మీట్‌లో ఖర్చుకు సంబంధించిన బిల్లు ఆమోదం పొందాల్సి ఉంటుంన్నారు.



ఎస్టీపీ-1 వద్ద మరమ్మతులు చేయడానికి తెచ్చిన పైపులు

పశువైద్య శిబిరం విజయవంతం

కళ్యాణదుర్గంరూరల్, జూన్ 18: మండలంలోని పాపంపల్లిలో గొడ్డుమోతు పశువైద్య శిబిరాన్ని పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ శిబిరంలో 87 పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ, చూడి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా 99 దీర్ఘకాలిక వ్యాధిగ్రస్త పశువులకు, 27 లేగదూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. జిల్లా పశు గణాభివృద్ధి అధికారి డాక్టర్ టీవీ సుధాకర్ మాట్లాడుతూ పశువులకు సరైన పోషణ కొరకు పచ్చి మేత, దాణాతో పాటు కొండ చిగురాకు, మునగాకు, ఉలవలు, పెసలు వంటివి పెట్టాలన్నారు. తద్వారా హార్మోన్స్ లోపం పోషకాహార లోపాలు లేకుండా పశువులు త్వరగా చూలు కడతాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జి వెంకటేష్, ఉప సంచాలకులు ఉరవకొండ, పాల్వాయి పశు చికిత్సాలయం, డాక్టర్ పి మంజునాథ, బెళుగుప్ప వైద్యాధికారి డాక్టర్ ఏ రమేష్, హరణి, పశుసంవర్ధక సహాయకులు శశికళ, పుల్లారెడ్డి, తిమ్మరాజు, సతీష్, గోపాలమిత్ర, నాగార్జున, తదితర పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మంత్రి కేశవ్‌ను సన్మానిస్తున్న మండలంలోని ఆర్ కొట్టాల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పవన్‌కుమార్, లోకేశ్, జేఈ సర్పరాజ్, గ్రామ కార్యదర్శి కొత్తకోట లోకేశ్ తదితరులు - విడపనకల్లు

రస్తా సమస్యను పరిష్కరించండి

రాయదుర్గంరూరల్, జూన్ 18: రస్తా సమస్యను పరిష్కరించాలని జుంజురంపల్లి, వేపరాల, కాశీపురం, మల్కాపురం రైతులు కోరారు. వారు మంగళవారం తహసీల్దార్ చిట్టిబాబు, సీఐ శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. కదరంపల్లి గ్రామానికి చెందిన గంగాధర కుమారులు శివకుమార్, మల్లికార్జునలు కలిసి పూర్వం నుంచి ఉండే రస్తాను ఎక్స్‌కవేటర్ సాయంతో అడ్డంగా తవ్వించారన్నారు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు గంగాధర, శ్రీనివాసులు, వెంకటేశులు వాపోయారు. వందలాది ఎకరాలు భూములున్న రైతులందరూ ఈ రస్తాలోనే రాకపోకలు సాగిస్తున్నట్లు తెలిపారు. ఆవులదేవర జుంజప్పగుడి అక్కడే ఉండడంతో వెళ్లడానికి భక్తులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.

మంత్రి కేశవ్‌ను కలిసిన ఎమ్మెల్యే పరిటాల సునీత

ఉరవకొండ, జూన్18: మండలంలోని కౌకుంట్ల గ్రామంలో ఆర్థిక, వాణిజ్య పన్నుల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రికి పుష్ప గుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అలాగే మంత్రి కేశవ్‌ను పలుశాఖల అధికారులు కలిసి పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు. కసాపురం, పెన్నహోబిలం ఆలయాల అర్చకులు, ఈఓ విజయ్‌కుమార్, గ్రూప్‌టెంపుల్ ఈఓ కృష్ణయ్య, మంత్రిని కలిసి స్వామి వారి చిత్రపటాన్ని అందజేసి ప్రసాదాలను అందజేశారు.



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు చెబుతున్న పరిటాల సునీత

రెండు బైక్‌లు ఢీ- ముగ్గురికి గాయాలు

గుంతకల్లుటౌన్,జూన్18: వజ్రకరూరు-ఎద్దులపల్లి రోడ్డులో మంగళవారం సాయంత్రం రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ముగ్గురు గాయపడ్డారు. పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లోని కాలువ గడ్డ వద్ద నివాసముంటున్న సురేష్, అంజిలు ఎద్దులపల్లిలో గ్రానైట్ పనికి వెళ్లారు. తిరిగి గుంతకల్లుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. వజ్రకరూరు మండలం బోడిసానిపల్లి తండాకు చెందిన హరినాయక్ వజ్రకరూరు నుంచి గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఎద్దులపల్లి గ్రామ సమీపం రోడ్డులో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గాయపడిన ముగ్గురిని గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తలిరంచారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

గుత్తి, జూన్ 18: పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. పట్టణంలోని 21వ వార్డు సీపీఐ కాలనీలో 7.5హెచ్‌పీ మోటార్‌ను ఏర్పాటు చేసి తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నామన్నారు. మిగిలిన వార్డుల్లో చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి సత్యకుమార్‌ను కలిసిన ఎన్జీవో నాయకులు

కళ్యాణదుర్గం రూరల్, జూన్ 18: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను రాష్ట్ర ఏపీ ఎన్జీవో ఉపాధ్యక్షులు జక్కుల మాధవ, నాయకులు మంగళవారం ధర్మవరంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్‌తో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఎల్లప్పుడూ అండగా వుంటుందని తెలిపారు.



మంత్రికి కేక్ తినిపిస్తున్న ఏపీఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షులు జక్కుల మాధవ తదితరులు

బాలకార్మికులను పనుల్లో పెట్టుకోవద్దు

రాయదుర్గంరూరల్, జూన్ 18: దుకాణాల్లో బాలకార్మికులను పనుల్లో పెట్టుకుంటే కేసులు నమోదు చేస్తామని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సుజాత హెచ్చరించారు. పట్టణంలోని కణేకల్లురోడ్డు, వినాయకసర్కిల్, లక్ష్మీబజార్, మెకానిక్ షాప్‌లు, టీస్టాళ్లలో అధికారులు మంగళవారం తనిఖీలు చేశారు. అనంతరం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 14 సంవత్సరాలు లోపు ఉన్న బాల బాలికలతో పనులు చేయించడం నేరమన్నారు. ఈ కార్యక్రమంలో బాలల సంరక్షణ సమితి ప్రతినిధి రమాదేవి, రెడ్స్ సంస్థ ప్రతినిధి సురేఖ తదితరులు పాల్గొన్నారు.

స్థల వివాదంలో గొడవ

కళ్యాణదుర్గంరూరల్, జూన్ 18: మండలంలోని బాల వెంకటాపురం గ్రామానికి చెందిన నాగలక్ష్మిని స్థల వివాదంలో గోపాల్ ఆయన భార్య, కుమారుడు ముగ్గురు కలిసి కర్రలతో దాడి చేసి గాయపరిచారని బాధితు రాలు తెలిపింది. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఫిర్యాదు అందుకున్న రూరల్ పోలీసులు విచారిస్తున్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై హర్షం



హర్షం వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

గుత్తి, జూన్18: ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండో సంతకం చేయడం హర్షనీయమని పలువురు న్యాయవాదులు పేర్కొన్నారు. స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రత్నం, కార్యదర్శి చంద్రశేఖర్, న్యాయవాదులు మనోహర్‌బాబు, రసూల్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు పనులు కల్పించండి

యల్లనూరు, జూన్18: ఉపాధిహామీ పథకం ద్వారా మండలంలోని కూలీలకు పనులు కల్పించాలని మండల టీడీపీ నాయకులు ఎంపీడీఓ వీరరాజును మంగళవారం కోరారు. రెండువారాల నుంచి పనులు మండలంలో జరగలేదన్నారు. అన్ని పంచాయతీల్లో పనులు మొదలయ్యేలా చూడాలని రామాంజనేయులు, రామకృష్ణారెడ్డి, చల్లా చంద్రశేఖర్‌నాయుడు, కుళ్లాయప్పనాయుడు, సదాశివరెడ్డి కోరారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఉరవకొండ, జూన్18: పట్టణంలోని అద్దంకమ్మ దేవి ఆలయ 13వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. యేళ్ల కుటుంబానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి, జూన్ 18: పట్టణంలోని అనంతపురం రోడ్డులో మంగళవారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొట్టడంతో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పట్టణం లోని బీసీ కాలనీకి చెందిన దస్తగిరి తన ద్విచక్ర వాహనంపై అనంతపురం రోడ్డు వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీ కొంది. ఈ సంఘటనలో దస్తగిరి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

మద్యం మత్తులో రాళ్లదాడి

పెద్దవడుగూరు, జూన్ 18: మండలంలోని కిష్టిపాడు గ్రామంలో రమణ అనే వ్యక్తి మద్యం మత్తులో అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచు హరినారాయణ ఇంటిపై మంగళవారం రాళ్లతో దాడిచేశాడని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

యాడికి, జూన్18: మండలంలోని రాయలచెరువు గ్రామానికి చెందిన ఆరుగురు పేకాటరాయుళ్లను మంగళవారం అరెస్ట్ చేసినట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. రాయలచెరువు గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంతో దాడి చేసినట్లు సీఐ తెలిపారు. ఆరుగురుని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.5150 నగదు, 4బైక్‌లు సీజ్ చేసినట్లు తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో టీడీపీ నాయకులు

కూడేరు, జూన్ 18: ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పదవి రావడంతో కొర్రకోడు టీడీపీ నాయకులు విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు తదితర వాటిని పంపిణీ చేశారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం పయ్యావుల సోదరులతోనే సాధ్యమవుతుందని తెలిపారు.

విత్తన శుద్ధి తప్పనిసరి

గుంతకల్లుటౌన్, జూన్ 18: వేరుశనగ సాగు చేసే ప్రతి రైతు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి స్వాతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో 3750 మందికి సబ్సిడీపై విత్తన వేరుశనగ పంపిణీ చేశామన్నారు. రైతులు పంటలను తెగుళ్ల బారీ నుంచి రక్షించుకోవాలని ఆమె సూచించారు.

దోమల నివారణతోనే మలేరియా వ్యాప్తికి అడ్డుకట్ట

మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీలో వైద్య సిబ్బంది



బెళుగుప్పలో అవగాహన కల్పిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి తిరుపాలయ్య

బెళుగుప్ప, జూన్ 18: పరిసరాల పరిశుభ్రతతోనే మలేరియా రహిత సమాజం నిర్మాణమవుతుందని సబ్ యూనిట్ అధికారి తిరుపాలయ్య పేర్కొన్నారు. బెళుగుప్ప లో మంగళవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవంపై స్థానిక కేజీబీవీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఇందులో తిరుపాలయ్య పాల్గొని విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కేజీబీవీ, బీసీ వసతి గృహంలో దోమల నివారణకు మలాథియన్ స్ప్రే చేశారు. వైద్యసిబ్బంది. ఏఎన్ఎం అనురాధ, కేజీబీవీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విడపనకల్లు: దోమ కాటు వల్ల మలేరియా వ్యాధి సోకే ప్రమాదం ఎక్కువగా ఉందని ఉరవకొండ ఏరియా మలేరియా యూనిట్ అధికారి భక్తుల కోదండ రామిరెడ్డి పేర్కొన్నారు. మలేరియా వ్యతిరేక దినంపై మండల అధికారులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కావటంతో దోమల ఉధృతి ఎక్కువైందన్నారు. దీంతో వ్యాధుల ప్రమాదం పొంచి ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కొండయ్య, ఈఓఆర్డీ సత్యబాబు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యాడికి: దోమల నివారణతోనే మలేరియా వ్యాప్తికి అడ్డుకట్ట వేయవచ్చని మలేరియా నివారణ తాడిపత్రి సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని తిప్పారెడ్డిపల్లి గ్రామంలో దోమలవ్యాప్తి, నివారణపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. మురుగునీటి కుంటలు, డ్రైనేజీ నిల్వ ప్రాంతాల్లో ఆరోగ్యసిబ్బంది ఆయిల్ బాల్స్ వేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాంప్రసాద్‌గౌడ్, పలువురు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



కొండాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



హరేసముద్రంలో వైద్య సిబ్బంది ర్యాలీ

బొమ్మనహాళ్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని బొమ్మనహాళ్ వైద్యాధికారి మల్లేశ్వరి అన్నారు. మంగళవారం మండలంలోని హరేసముద్రం గ్రామంలో సీజనల్ వ్యాధులపై ర్యాలీ నిర్వహించారు. ప్రస్తుతం చికున్‌గన్యా, మలేరియా, డెంగీ వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయని, దోమలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. పరిసరాలలో నీటి నిల్వలు లే కుండా, దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాల న్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తిప్పేస్వామి, హెల్త్ అసిస్టెంట్ గోవర్ధన్, ఏఎన్ఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.



విడపనకల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

రాయదుర్గంరూరల్: వర్షాకాలం ప్రారంభం కావడంతో మలేరియా, డెంగీ, వాంతులు, విరేచనాలు వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని రాయదుర్గం మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఆవులదట్ల పీహెచ్‌సీ పరిధిలోని కొండాపురం గ్రామంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాలలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భీమేష్, ఏఎన్ఎం విజయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.